




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 26 గురువారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 99

Navabhoomi daily fallows..


## నేడు సీఎంతో
# సినీ ప్రముఖుల భేటీ

- సీఎంతో చిరంజీవితో సహా సినీ ప్రముఖుల భేటీ
- సినీ పరిశ్రమకు చెందిన సమస్యలను సీఎం దృష్టికి
- సినీ పరిశ్రమకు ఇన్సెంటివ్స్ ఇవ్వడం, పన్నుల విధానం
- సౌకర్యాల అభివృద్ధి,బెనిఫిట్ షో పునరుద్ధరణ
- టికెట్ల పెంపు వంటి అంశాలపై చర్చ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ మృతి చెందడం, ఆమె కుమారుడు తీవ్ర గాయాలపాలైన విషయం విదితమే. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఆయన హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. తాజాగా, ఆయనను పోలీసులు విచారించారు. ఈ నేపథ్యంలో సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రముఖ సినీనిర్మాత, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు వ్యవహరిస్తున్నారు. ఊహించని ఘటన ఓ కుటుంబంలో విషాదాన్ని నింపిందని.. ఆ కుటుంబానికి అందరం అండగా ఉండాలన్నారు. బుధవారం దిల్ రాజుతోపాటు అల్లు అరవింద్, పుష్ప2 సినీమా యూనిట్.. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించారు. రేవతి భర్తకు సినిమా ఇండస్ట్రీలో శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని దిల్ రాజు చెప్పారు. తమరోవైపు రేవతి కుటుంబానికి అల్లు అర్జున్ రూ. కోటి, దర్శకుడు రూ. 50 లక్షలు, నిర్మాతలు రూ. 50 లక్షలు మొత్తంగా రూ. 2 కోట్లు సాయం ప్రకటించారు. ఈ క్రమంలో రేపు (గురువారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులతో కలిసి భేటీ కానున్నట్లు దిల్ రాజు వెల్లడించారు. గురువారం ఉదయం 10 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో టాలీవుడ్ నుంచి ప్రముఖ సినీనటులు, నిర్మాతలు, దర్శకులు హాజరుకానున్నారు. సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్యలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ భేటీకి దిల్ రాజుతోపాటు సినీ పరిశ్రమ నుంచి చిరంజీవి, వెంకటేష్, అల్లు అరవింద్, తదితరులు పాల్గొననున్నారు. ఇక, ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,

# కేటీఆర్ చెప్పిండు..చేశా..

- ఫార్ములా ఈరేస్ కేసులో కీలక పరిణామం
- ఫార్ములా ఈకార్ రేసులో దానకిశోర్ స్టేట్‌మెంట్ రికార్డు
- దానకిశోర్ నుంచి కీలకమైన డాక్యుమెంట్ల స్వాధీనం
- కేటీఆర్ ఆదేశం మేరకే హెచ్ఎండీఏ ద్వారా రూ.55 కోట్లు
- ఏపీఓకు బదిలీ చేశానన్న దానకిశోర్
- స్టేట్‌మెంట్ ఆధారంగా కేటీఆర్,అరవింద్‌కు నోటీసులు

2



**హైదరాబాద్, డిసెంబర్ 25, (నవభూమి ప్రతినిధి) :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఫార్ములా కేసులో ఫిర్యాదుదారుడు దాన కిషోర్ స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేసింది. దాదాపు ఏడు గంటల పాటు ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది ఏసీబీ. దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఏసీబీ అధికారులు విచారణను ప్రారంభించను న్నారు. దాన కిషోర్ నుంచి పలు కీలకమైన డాక్యుమెంట్లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి దానకిషోర్ వివరణ ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే డబ్బులు బదిలీ చేసినట్లు వెల్లడించారు. తన పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ ద్వారా ఎస్ఈఓకు డబ్బులు బదిలీ చేసినట్లు తెలిపారు. 55 కోట్ల రూపాయల నగదును ఏపీవోకు బదిలీ చేసినట్లు దానకిషోర్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ చేయనున్న ఏసీబీ.. త్వరలో మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసులో ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయా శాఖల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి.. నగదు బదిలీలో అవకతవకలు నిర్ధారణకు వచ్చిన ఏసీబీ ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా ప్రైవేటు కంపెనీ సీఈవో పేరును చేర్చింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ కేసును క్వాష్ చేయాలంటూ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి కేటీఆర్‌కు స్వల్ప ఊరట లభించింది. ఎలాంటి అరెస్ట్ చేయవద్దంటూ గత విచారణలో న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఏసీబీ అధికారులకు చేరింది. దీంతో ఫిర్యాదుదారుడు దాన కిషోర్‌ను ఏసీబీ అధికారులు విచారించి.. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. దాన కిషోర్ స్టేట్‌మెంట్ తరువాత తొలుత ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను, ఆ తరువాత మాజీ మంత్రి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసి విచారించే అవకాశం

# సంక్రాంతికి కొత్త కార్యవర్గం

- సంక్రాంతికి కొత్త కార్యవర్గం.. పీసీసీ కార్యవర్గ ప్రకటన
- ప్రచార కమిటీ చైర్మన్‌గా జగ్గారెడ్డి..కార్యనిర్వాహక అధ్యక్షులుగా ముగ్గురు
- సీడబ్ల్యూసీ తర్వాత ఇన్‌చార్జి కార్యదర్శినీ మార్చే అవకాశం
- కొత్త కార్యవర్గం ఏర్పాటుపై ఇటీవల ఏఐసీసీ కసరత్తు

2



## ఎస్ఐ,మహిళా కానిస్టేబుల్
# ఆత్మహత్య

- వారితో పాటే కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ కూడా
- అనుమానాస్పదంగా మారిన ముగ్గురి ఆత్మహత్యలు
- ఇప్పటి వరకు లభ్యం కాని ఎస్ఐ మృతదేహం
- వెల్లడికాని ఆత్మహత్యకు గల కారణాలు

2

**కామారెడ్డి-నవభూమిబ్యూరో**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూరులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి పెద్ద చెరువులో దూకి బిక్కనూరు మండలం ఎస్ఐ సాయి కుమార్, బీబీపేట్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారితోపాటు నిఖిల్ అనే మరో వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతులకు సంబంధించిన పలు ఆనవాళ్లు చెరువు వద్ద లభించడంతో చనిపోయింది వారేనని పోలీసులు భావిస్తున్నారు. కారుతోపాటు నిఖిల్







## సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయకుమార్ రెడ్డిపై
# ఏసీబీ కేసు!

- అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ కొందరికి అయాచిత లబ్ధి చేకూర్చారన్న అభియోగం
- ఐఅండ్‌పీఆర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగ నియమాకాల్లో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు
- గత సర్కార్‌లోని ఓ పత్రికకు అపరిమితమైన ప్రకటనలు
- సర్కారుకు వ్యతిరేకంగా ఉన్న పత్రికలపై కక్షపూరితంగా వ్యవహరించిన కమిషనర్

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

వైసీపీ సర్కారులో కీలక పోస్టుల్లో పనిచేసిన ఒక్కో అధికారిపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. వైసీపీ సర్కారులో కీలక పోస్టుల్లో పనిచేసిన ఒక్కో అధికారిపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. జూన్ లో అధికారంలోకి వచ్చిన



## చంద్రబాబుకు
# కీలక బాధ్యతలు

- ఢిల్లీ పర్యటనలో బిజీ బిజీగా గడిపిన ఏపీ సీఎం చంద్రబాబు
- ప్రధాని నరేంద్ర మోదీతో గంటన్నరకు పైగా చర్చలు
- చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీ
- దక్షిణాదిన ఎన్డీఏ విస్తరణకు ఫార్ములా సిద్ధం చేసిన మోదీ,షా
- దీనిలో భాగంగానే చంద్రబాబుకు కీలక బాధ్యతలు
- త్వరలో జరగనున్న ఎన్డీఏ సమావేశంలో దీనిపై ప్రకటన

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

చంద్రబాబుకు బాధ్యతలు మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల తర్వాత ఎన్డీఏ నేతలు తొలిసారి భేటీ కానున్నారు. ఢిల్లీ, బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ రెండు రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వైఖరిపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇక..జమిలి బిల్లుల ఆమోదానికి వీలుగా అమలు చేయాల్సిన కార్యాచరణ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. దక్షిణాదిన ఎన్డీఏ విస్తరణ కోసం ఇప్పటికే ప్రధాని మోదీ - అమిత్ షా ఒక ఫార్ములా సిద్ధం చేసారు. అమల్లో భాగంగా ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించనున్న ట్లు తెలుస్తోంది. జమిలి ప్రధాన అజెండాగా సాగుతున్న ఎన్డీఏ సమావేశంలో కీలక వ్యూహాలు ఖరారు చేయనున్నారు.

**ప్రధాని మోడీ సహా కేంద్రమంత్రులతో చంద్రబాబు భేటీ:** ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోడీతో బుధవారం గంటకుపైగా సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి సహా పలు కీలక అంశాలపై ప్రధానితో చంద్రబాబు

# ఏపీ సీఎస్‌గా సాయిప్రసాద్?

- ఈ నెలాఖరుకు ప్రస్తుత సీఎస్ నీరభ్‌కుమార్‌కు ముగుస్తున్న పదవీకాలం
- పదవీ విరమణ చేసిన వెంటనే నీరభ్‌కు మరో కీలకమైన బాధ్యతలు
- సీఎస్ ఎంపికకై సీఎం చంద్రబాబునాయుడు కసరత్తు
- సీనియారిటీ ప్రాతిపదికన సాయి ప్రసాద్‌కే ఎక్కువ అవకాశాలు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీకి కొత్త సీఎస్ దాదాపు ఖరారయ్యారు. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకం పై సీఎం చంద్రబాబు ఇప్పటికే కసరత్తు పూర్తి చేసారు. ప్రస్తుత సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్‌కు పొడిగించిన పదవీ కాలం ఈ నెలా ఖరుతో ముగుస్తోంది. నీరభ్‌కు ముఖ్యమంత్రి మరో కీలక బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సీఎస్‌గా ఎంపిక వేళ పలువురు సీనియర్ల పేర్లు రేసులోకి వచ్చాయి. కానీ, సీనియారిటీ ప్రాతిపదికన సాయి ప్రసాద్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజు ల్లోనే అధికారికంగా నిర్ణయం తీసుకునే అవకా శం ఉంది. చంద్రబాబు కసరత్తు ఏపీకి కొత్త సీఎస్ నియామకంపైన చంద్రబాబు అధికారి కంగా నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. ప్రస్తుత సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ తరువాత సీనియార్టీ మేరకు ఎనిమిది మంది ఐఏఎస్ జాబితాలో ఉన్నారు. సీనియార్టీలో శ్రీలక్ష్మి ముందు వరుసలో ఉన్నా.. ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వక పోవటంతో సీఎస్‌గా ఛాన్స్ కనిపించటం లేదు. ఇక, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇతర సర్వీసుల్లో ఉన్న సుమిత దావ్రా, రెవెన్యూ

# బీజేపీలోకి వంశీ?

- వైసీపీ ఓటమి తర్వాత ఏడాదిగా చడీ చప్పుడు లేని వంశీ
- కూటమి ప్రభుత్వం కేసులపై వెన్నాడుతున్న భయాలు
- చంద్రబాబు,పవన్,లోకేశ్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం వల్ల మూసుకుపోయిన టీడీపీ,జనసేనలోకి వెళ్లే ద్వారాలు
- బీజేపీలోకి వెళ్తే..కేసుల నుంచి తప్పించుకోవచ్చన్న భావన

2




**అమరావతి-నవభూమిబ్యూరో**

వంశీ మీద కేసులు ఉంటాయని ఆయనను ఇబ్బందుల పాలు చేస్తారని వార్తలు వినవస్తున్న నేపథ్యంలో కూటమిలో కీలకమైన బీజేపీలో చేరడం ద్వారా ఆయన అధికార కూటమి నేత అవుతారు అని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసి ఒక సారి ఎంపీ టికెట్ ని రెండు సార్లు ఎమ్మెల్యే టికెట్ ని అందుకుని రెండు సార్లు వరసగా విజయవాడ గన్నవరం అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వారు వల్లభనేని వంశీ. అంగబలం అర్థబలం ఉన్న వంశీని టీడీపీ బాగానే ప్రోత్సహించింది. ఆయన కూడా పార్టీ ఇచ్చిన అవకాశాలను వాడుకుంటూ దూకుడుగానే రాజకీయం చేశారు. అయితే 2019లో టీడీపీ ఓటమి తరువాత ఆయన అడుగులు వైసీపీ వైపు పడ్డాయి. అలా ఆయన జగన్ సమక్షంలో ఫ్యాన్ నీడకు చేరారు. అప్పటి నుంచి ఆయన టీడీపీ అధినాయకత్వం మీద తీవ్ర విమర్శలు చేస్తూ వచ్చారు. ఒక దశలో చంద్రబాబు లోకేష్ ల మీద వ్యక్తిగత విమర్శలూ ఎక్కుపెట్టారు. అవి కాస్తా అతి పెద్ద వివాదానికి కూడా దారి తీశాయి. ఆ పరిణామాల నేపథ్యం కూడా వంశీకి కంచుకోట లాంటి గన్నవరంలో

## టీడీపీ కోటాలో గవర్నర్‌గా
# అశోక్‌గజపతిరాజు?

- ఇప్పటికే ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించిన కేంద్రం
- త్వరలో మరికొన్ని రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- ఈ నియామకాల్లో ఎన్డీఏ మిత్ర పక్షాలకు ఛాన్స్
- టీడీపీకి నుంచి ఒకరికి గవర్నర్‌గా నియమించే అవకాశం
- రేసులో మాజీ మంత్రి,సీనియర్ నేత అశోక్ గజపతిరాజు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

టీడీపీ కోటాలో గవర్నర్‌గా ఆయన పేరు కన్ ఫర్మ్? నూటికి తొంభై శాతం అశోక్ గజపతిరాజుకే గవర్నర్ పదవి ఆఫర్ ఉందని అంటున్నారు. బాబు కూడా ఆయన పేరునే ప్రతిపాదించవచ్చు అని చెబుతున్నారు.

దేశంలో అరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకాలను కేంద్ర ప్రభుత్వం తాగా చేసింది. దాంతో ఇపుడు అందరి దృష్టి టీడీపీ మీద పడింది. ఆ పార్టీ నుంచి ఒకరికి గవర్నర్ గా అవకాశం ఉంది అని అంటున్నారు. ఈ మేరకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ టీడీపీకి ఆఫర్ ఇచ్చింది అని అంటున్నారు. మిత్రుల కోటాలో ఎన్డీయేలో రెండవ పెద్ద పార్టీ అయిన టీడీపీకి ఒక గవర్నర్ పదవి కచ్చితంగా దక్కుతుంది అని అంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయమే తరువాయి అని అంటున్నారు. ఆయన ఎవరి పేరు ప్రతిపాదిస్తే వారే దేశంలో ఒక రాష్ట్రానికి గవర్నర్ అవుతారు. దాంతో ఇపుడు బాబు ఏమి చేయబో తున్నారు అని అంతా చర్చిస్తున్నారు. చంద్ర బాబు గవర్నర్ పదవి కోసం ఎవరి పేరుని ప్రతిపాదిస్తారు అన్నది అయితే ఆసక్తికరంగా ఉంది. సాధారణంగా గవర్నర్ పదవి అంటే

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు



హైదరాబాద్-నవభూమి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడంటూ గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కౌశిక్ రెడ్డితో పాటు 20 మంది అనుచరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. సీఎం రేవంత్ రెడ్డి, ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్ టాప్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన సమయంలో సీఐతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ కేసులో కౌశిక్ రెడ్డిని డిసెంబర్ 6న పోలీసులు అరెస్ట్ చేశారు. కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందుహాజరు పరిచినప్పుడు ఆయనకు కోర్టు వెంటనే బెయిల్ మం జూరు చేసింది. అయితే ఈనెల 27న మరోసారి వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మాసబ్ ట్యాంక్ పోలీసుల ముందు హాజరుకావాలని ఆదేశించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై మాసబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి.. విచారణకు రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. మాసబ్‌ట్యాంక్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చి న ఫిర్యాదు మేరకే కౌశిక్ రెడ్డిపై మాసబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేశారు. డిసెంబర్ 6న గచ్చిబౌలిలోని ఇంట్లో ఎమ్మెల్యేను అరెస్ట్ చేసి నేరుగా న్యాయస్థానం ముందు హాజరుపర్చారు. అయితే వెంటనే కౌశిక్ రెడ్డికి న్యాయ స్థానం బెయిల్ మంజూరు చేసింది.





## ఈ ఏడాది హైదరాబాద్ బిర్యానీదే హవా.. వామ్మో 'స్విగ్గీ'లో ఇన్ని కోట్ల ఆర్డర్లా..!



హైదరాబాద్-నవభూమి: భోజన ప్రియులకు హైదరాబాద్ అంటే ఠక్కున గొర్తుచ్చేది బిర్యానీ. హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్నారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడి బిర్యానీ రుచి చూడకుండా వెళ్లరంటే అతిశయోక్తి కాదు. అంతలా ఆదరణ పొందింది హైదరాబాద్ బిర్యానీ. సామాన్యుల నుంచి సెలబ్రేటీల వరకు హైదరాబాద్ బిర్యానీ తినేందుకు ఇష్టపడుతుంటారు. సీజన్‌తో సంబంధం లేకుండా.., పండుగ ఏదైనా ముందు వరుసలో ఉండేది బిర్యానీయే. ఈ విషయం మరోసారి నిరూపితమైంది. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఆరగించిన ఫుడ్ బిర్యానీయే. దేశంలోనే అత్యధికంగా నిమిషానికి 34 బిర్యానీలను ఆర్డర్ చేశారు. హైదరాబాద్‌కు సంబంధించి ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గి మంగళవారం ఆర్డర్ల వివరాలు వెల్లడించింది. ఈ ఏడాదిలో ఏకంగా 1.57 కోట్ల ప్లేట్ల బిర్యానీలను ఆరగించినట్లు రిపోర్టులో వెల్లడైంది. మధ్యాహ్నం, రాత్రి మాత్రమే కాకుండా తెల్లవారుజామున 4 గంటలకు సైతం బిర్యానీ ఆర్డర్ పెట్టినట్లు తెలిపారు. ఎక్కువ మంది చికెన్ బిర్యానీనే ఆరగిస్తున్నారని చెప్పారు. ఓ వ్యక్తి ఈ ఏడాదిలో 60 బిర్యానీల కోసం ఏకంగా రూ.18,840 ఖర్చు పెట్టాడు. టీ20 ప్రపంచకప్ సందర్భంగా 8.69 లక్షల బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్లు చెప్పారు. ఇక బిర్యానీ తర్వాత.. టిఫిన్‌లలో దోశను ఎక్కువగా ఆర్డర్ చేశారు. దోశ ఆర్డర్లలో దేశంలోనే హైదరాబాద్ మొదటిస్థానంలో ఉంది. ఈ ఏడాది 17.54 లక్షల దోశ ఆర్డర్లు వచ్చినట్లు స్విగ్గీ వెల్లడించింది. ఒక్క స్విగ్గీ ఆర్డర్లే ఇలా ఉంటే మిగతా ఫుడ్ డెలివరీ యాప్స్, రెస్టారెంట్లో, వేడుకల్లో ఆరగించే విందులను కలుపుకొంటే బిర్యానీల సంఖ్య రెట్టింపుకన్నా ఎక్కువే ఉంటుందని అంటున్నారు. ఇక రంజాన్ 2024 సందర్భంగా స్విగ్గీలో 6 మిలియన్ ప్లేట్ల బిర్యానీని ఆర్డర్ చేసినట్లు ఈ నివేదికలో వెల్లడించారు.

ఆ టైంలో కూడా హైదరాబాద్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. ఒక్క హైదరాబాద్ నుంచే 10 లక్షల ప్లేట్ల కంటే ఎక్కువ బిర్యానీలు ఆర్డర్ చేసినట్లు నివేదికలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా బిర్యానీ ఆర్డర్లలో హైదరాబాద్ తర్వాత.. బెంగళూరు రెండో ప్లేస్‌లో ఉంది. బెంగళూరులో 7.7 మిలియన్ బిర్యానీలు ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ నివేదికలో వెల్లడైంది.

## 'మీరున్న ప్రాంతం చెరువులో ఉందా, లేదా అని ఒక్క క్లిక్‌తో ఈజీగా తెలుసుకోవచ్చు'




హైదరాబాద్-నవభూమి: హైడ్రా కూల్చివేతలపై ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ ఏడాది జులైకి ముందు కట్టిన ఏ ఒక్క నిర్మాణాన్ని తాము కూల్చలేదని స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు కబ్జాకు గురైతే సహించేది లేదన్నారు. తాము తీసుకొచ్చే ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాలను ఈజీగా తెలుసుకోవచ్చునని అన్నారు. హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ ఏవీ రంగనాథ్ మరోసారి కీలక కామెంట్స్ చేశారు. నిర్మాణ అనుమతితో సంబంధం లేకుండా.. ఈ ఏడాది జులైకి ముందు కట్టిన ఏ ఒక్క ఇంటిని కూడా హైడ్రా కూల్చలేదని స్పష్టం చేశారు. ఓ మీడియా ఛానెల్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. భవిష్యత్తు తరాలకు ఓ మంచి నగరాన్ని అందించాలన్న గొప్ప లక్ష్యంతో హైడ్రా ఏర్పాటైందన్నారు. అందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కు స్థలాల్లోని వ్యాపార కేంద్రాలను, నిర్మాణంలో ఉన్న నివాస సముదాయాలను మాత్రమే తాము ఇప్పటి వరకు నేలమట్టం చేసినట్లు వెల్లడించారు. చెరువులు, నాలాలను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమనే సందేశాన్ని బలంగా చెప్పేందు, ఆక్రమణదారులను అదుపు చేసేందుకు ప్రారంభంలో దూకుడుగా వెళ్లినట్లు తెలిపారు. చెరువుల విధ్వంసం ముమ్మందు కొనసాగకుండా చూడటం హైడ్రా కర్తవ్యమన్నారు. ప్రస్తుతం నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టిపెట్టామని.. కూల్చివేతలూ ఆపే ప్రసక్తి లేదని.. అన్ని అంశాలు పరిగణలోనికి తీసుకొని అక్రమ నిర్మాణాలైతే నేలమట్టం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ధరణకు సర్వే జరుగుతోందని... త్వరలోనే మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకొస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. నాలుగు నుంచి ఐదు నెలల్లో పరిశోధన సంస్థలు, ఉపగ్రహ పటాలు, గ్రామ పటాలు, చెరువు అలుగుల ఎత్తు, కాంటూర్ స్థాయిల ఆధారంగా చెరువులన్నింటి ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయించి నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ వరకు ఉన్న చెరువుల సంరక్షణ కమిటీ ఛైర్మన్‌గా హైడ్రా కమిషనర్‌ను నియమించడంతో.. ఆ ప్రక్రియలో వేగం పెంచామని తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై స్పష్టత రాగానే.. డిజిటల్ సమాచారంతో మొబైల్ యాప్‌ను తీసుకొస్తామన్నారు. ఈ ప్రత్యేక యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తో మీరున్న ప్రాంతం చెరువులో ఉందా, లేదా అనేది ఈజీగా తెలుసుకోవచ్చునని చెప్పారు. ఆక్రమణలపై హైడ్రాకు ఇప్పటికే 6 వేలకు పైగా ఫిర్యాదులందాయని చెప్పారు. కొత్త ఏడాది నుంచి ప్రతి సోమవారం ట్యాంక్‌బండ్ బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 1.30గంట నుంచి 3.30గంటల మధ్య తాను ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తాను అందుబాటులో లేకపోతే 7207923085 నెంబర్‌కు వివరాలు పంపొచ్చునని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేసారు.

# సంక్రాంతికి కొత్త కార్యవర్గం

హైదరాబాద్-నవభూమి: సంక్రాంతి తర్వాత టీపీసీసీ కొత్త కార్యవర్గం కొలువుదీరనుంది. జనవరి మొదటి వారంలో ముగ్గురు కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రచార కమిటీ ఛైర్మన్ సహా కార్యవర్గాన్ని ఏఐసీసీ ఖరారు చేయనుంది. ఏఐసీసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జినీ మార్చి.. కొత్త వారిని నియమించనుంది. మొత్తమ్మీద సంక్రాంతి తర్వాత తెలంగాణ కాంగ్రెస్ పార్టీ.. టీపీసీసీ చీఫ్ మహేషకుమార్‌గౌడ్ సారథ్యంలో నిర్మాణ పరంగా కొత్త దనం సంతరించుకోనుంది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్‌గౌడ్ నియామకం జరిగి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో కొత్త కార్యవర్గం ఏర్పాటుపై ఇటీవల ఏఐసీసీ కొంత కసరత్తు చేసింది. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ నియామకం జరిగినప్పుడు ఏకంగా ఐదుగురికి కార్యనిర్వాహక అధ్యక్షులుగా అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న తూర్పు జగ్గారెడ్డికి.. ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వద్ద జగ్గారెడ్డికి.. మంచి ఆర్గనైజర్ అన్న పేరుంది. జగ్గారెడ్డి ఆర్గనైజింగ్ స్కిల్‌ను పార్టీకి ఉపయోగించుకోవాలంటూ రాహుల్‌గాంధీ చేసిన సూచన మేరకే ప్రచార కమిటీ ఛైర్మన్ పోస్టును ఆయనకు ఖరారు చేసినట్లు చెబుతున్నారు. ఈసారి కార్యనిర్వాహక అధ్యక్షులుగా ముగ్గురికే అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడా సామాజిక వర్గాల నుంచి తీసుకోవాలన్న నిర్ణయానికి ఏఐసీసీ వచ్చినట్లుగా చెబుతున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నారు. ఏఐసీసీలోనే వంశీచంద్‌రెడ్డి సేవలను వినియోగించుకోవాలని అధిష్ఠానం భావిస్తే రేసులో రోహిన్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మిగులుతారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎస్టీ లంబాడా నుంచి ఎంపీ బలరాం నాయక్‌లను నియమించేందుకే ఎక్కువగా అవకాశం ఉంది. టీపీసీసీ అధ్యక్షుడే బీసీ కావడంతో.. ఆ వర్గం నుంచి కార్యనిర్వాహక అధ్యక్షుడిని తీసుకునే అవకాశం లేదంటున్నారు. ముస్లింల నుంచి కార్యనిర్వాహక అధ్యక్షుడిని తీసుకోవాలా.. వద్దా? అన్న తర్జనభర్జన కూడా పార్టీలో నడిచింది. ప్రస్తుతం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న అజారుద్దీన్‌నే మళ్లీ నియమించాలా? లేక నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్‌ను తీసుకోవాలా అన్నదానిపై చర్చ జరుగుతోంది. చివరి నిమిషంలో ముస్లింల నుంచీ ఒకరిని కార్యనిర్వాహకఅధ్యక్షుడిగా తీసుకోవాలని అధిష్ఠానం భావిస్తే ఫిరోజ్‌ఖాన్‌కే ఎక్కువ అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## సంధ్య థియేటర్ ఘటన.. రేవతి మృతికి తొక్కిసలాట కారణం కాదా..?



హైదరాబాద్-నవభూమి: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కారణంగానే రేవతి మృతి చెందిందని.. ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని అంతా భావిస్తున్నారు. అయితే ఆమె మృతికి తొక్కిసలాట కారణం కాదని కొందరు వాదిస్తున్నారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున అల్లు అర్జున్ అభిమానులు రావటంతో.. ఊపిరి ఆడక ఆమె మృతి చెందినట్లు చెబుతున్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు వెల్లడిస్తు న్నారు. సంధ్య థియేటర్ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. డిసెంబర్ 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రాగా.. ఆ సమయంలో జరిగిన తోపులాటలో సినిమా చూసేందుకు వచ్చిన రేవతి మృతి చెందింది. ఆమె తొమ్మిదేళ్ల కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తొక్కిసలాట కారణంగానే ఆమె చనిపోయినట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. అందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నాయి. అయితే ఆమె మృతికి తొక్కిసలాట కారణం కాదని.. కొందరు వాదిస్తున్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు కూడా చూపుతున్నారు. తొక్కిసలాట జరిగితే ఎముకలు విరగటం, అవయవాలు తీవ్రంగా దెబ్బతినటం వంటివి చోటు చేసుకుంటాయని అంటున్నారు. అయితే రేవతి మృతదేహంలో అలాంటి ఆనవాళ్లు ఏవీ లేవని వైద్యుల రిపోర్టులో వెల్లడైందని ప్రచారం జరుగుతోంది. ఎక్కవ సంఖ్యలో ఒకేచోటుకు అభిమానులు రావటంతో ఆమె ఊపిరి ఆడక మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు. ఒకరిపై ఒకరు తోసుకోవటం వల్ల ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయి ఊపిరాడక రేవతి మృతి చెందగా.. ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని అంటున్నారు. అయితే ఈ వాదనపై పోలీసుల నుంచి లేదా డాక్టర్ల నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**కోలుకుంటున్న శ్రీతేజ్**

ఇక ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ చిన్నారి శ్రీతేజ్ కోలుకుంటున్నాడు. ప్రస్తుతం అతడికి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా.. ఐసీయూ నుంచి మామూలు గదికి షిఫ్ట్ చేసినట్లు తండ్రి భాస్కర్ వెల్లడించారు. తన స్పృహ వచ్చిందని.. ఇంజెక్షన్ ఇచ్చే సమయంలో నొప్పి తెలుస్తోందని అన్నారు. అయితే ఇంకా తమను గుర్తించటం లేదని భాస్కర్ వెల్లడించారు. పక్కనే ఉండి ఎక్కువసార్లు పిలవటం ద్వారా గుర్తించే అవకాశం ఉందని.. అందుకే తాను పక్కనే ఉంటున్నట్లు చెప్పారు. అయినా శ్రీతేజ్ కోలుకోవటానికి చాలా సమయం పడుతుందని డాక్టర్లు చెప్పినట్లు వెల్లడించారు.

ఇదిలా ఉండగా.. థియేటర్ ఘటనపై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం విచారించారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఘటనకు సంబంధించిన వీడియోను అధికారులు చూపించగా.. బన్నీ భావోద్వేగానికి గురైనట్లు సమాచారం. మొత్తం 3.35 గంటల పాటు సాగిన విచారణలో కొన్ని ప్రశ్నలకు ఆయన తెలీదని జవాబిచ్చినట్లు తెలిసింది.

## బీజేపీలోకి వంశీ?

(1వపేజీ తరువాయి)2024 ఎన్నికల్లో ఆయన ఓటమికి దారి తీసిందని అంటారు. ఇక గడచిన ఆరు మాసాలుగా వంశీ అయితే పెద్దగా చడీ చప్పుడూ చేయడం లేదు. ఆయన మీద టీడీపీ కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసిందని కేసులు పెడుతుందని కూడా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన ఉండేది హైదరాబాద్ లోనా లేక అమెరికాలోనా అన్నది అయితే తెలియడం లేదు. మొత్తానికి ఆయన వైసీపీకి బహు దూరంగా ఉంటూ వస్తున్నారు అన్నది అయితే తెలిపోయింది అంటున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఎటూ టీడీపీ జనసేనలలో ప్రవేశానికి అవకాశం లేనందువల్ల కూటమిలో మూడవ పార్టీ అయిన బీజేపీలో చేరాలని చూస్తున్నారు అని వార్తలు అయితే పెద్ద ఎత్తున ప్రచారంలోకి వస్తున్నాయి. వంశీ మీద కేసులు ఉంటాయని ఆయనను ఇబ్బందుల పాలు చేస్తారని వార్తలు వినవస్తున్న నేపథ్యంలో కూటమిలో కీలకమైన బీజేపీలో చేరడం ద్వారా ఆయన అధికార కూటమి నేత అవుతారు అని అంటున్నారు.

ఆయన గతంలో చంద్రబాబు ఫ్యామిలీ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల టీడీపీ క్యాడర్ అంతా పూర్తి ఆగ్రహంతో ఉన్నారని అదే విధంగా ఆయన పదేళ్ల ఎమ్మెల్యే పాలనలో అక్రమాలు చేశారా అంటూ ఆరా తీసే పనులలో ఉన్నారని ఆ విధంగా ఆయన చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తుందని అంటున్నారు. దాంతో వైసీపీలో ఉంటే కచ్చితంగా తనకు ఇబ్బందులు తప్పవని భావించిన వంశీ బీజేపీ వైపుగా అడుగులు వేస్తున్నారు అని అంటున్నారు. బీజేపీలో చేరితే కనుక జాతీయ పార్టీ నుంచి పూర్తి రక్షణ ఉంటుందని ఆయన ఆలోచిస్తున్నారని అందుకే ఈ మాస్టర్ పొలిటికల్ స్కెచ్ గీసారని అంటు న్నారు. ఇదిలా ఉండగా వంశీ సాధ్యమైనంత తొందరలో కేంద్ర బీజేపీ నాయకత్వాన్ని కలుస్తారని జేపీ నడ్డా సమక్షంలో కమల తీర్థం పుచ్చుకుంటారని అంటున్నారు. ఈ వార్తలు అయితే ప్రస్తుతం విజయవాడలో గుప్పుమంటు న్నాయి. ఇదిలా ఉంటే వంశీని వైసీపీలోకి తెచ్చి ఆ పార్టీ బావుకున్నది ఏమీ లేదని అంటున్నారు. పైగా ఆయన అనుచితా వ్యాఖ్యల పరిణామాల వల్ల వైసీపీ భారీ మూల్యం గత ఎన్నికల్లో చెల్లించాల్సి వచ్చిందని కూడా అంటున్నారు ఆయన అపుడు కూడా షెల్టర్ కోసమే వైసీపీని ఆశ్రయించి ఆ పార్టీలో చేరారు అని విమర్శలు చేస్తున్న వారూ ఉన్నారు. పార్టీకి ఎంతో విధేయులుగా ఉన్న యార్లగడ్డ వెంకటరావుకు టికెట్ ని నిరాకరించి మరీ వంశీకి ఇవ్వడం ద్వారా వైసీపీ తన ఓటమిని తానే కొని తెచ్చుకుందని అంటున్నారు. ఇపుడు వైసీపీ ఓటమితో వంశీ తన రాజకీయాన్ని తాను చూసుకుంటున్నారని కూడా అంటున్నారు. ఏది ఏమైనా వంశీని బీజేపీ తీసుకోవడం ద్వారా టీడీపీకి ఏ విధంగా సమాధానం చెబుతుందన్న ప్రశ్నలు కూడా ఉన్నాయి. టీడీపీ జనసేన వద్దు అనుకున్న పార్టీలను బీజేపీ చేరదీయడం ద్వారా తన బలం పెంచుకోవడం పక్కన పెడితే కూటమిలో ఇబ్బందులకు దారితీస్తుందా అన్నది కూడా చర్చించుకుంటున్నారు. వల్లభనేని వంశీని బీజేపీ చేర్చుకోవడం ద్వారా ఏమి సాధిస్తుందో కానీ వంశీకి మాత్రం అధికారికం గా ఒక రక్షణ లభిస్తుందని అంటున్నారు.

## టీడీపీ కోటాలో గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు?

(1వపేజీ తరువాయి)రాజ్యాంగం గురించి క్షుణ్ణంగా అవగాహన ఉన్న వారిని ఎంచుకుంటారు. అంతే కాదు రాజకీయంగా సీనియర్ నేతగా ఉంటూ అనేక పదవులు నిర్వహించిన వారికి అనుభవం ఉన్న వారికి ఈ చాన్స్ దక్కుతుంది. అలా చూసుకుంటే బాబు మనసులో ఇద్దరి పేర్లు ఉన్నాయని అంటున్నారు. ఒకరి పేరు మాజీ మంత్రి యనమల రామక్రిష్ణుడు. ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఒక్క 2024లో తప్పించి టీడీపీ ఎపుడు అధికారంలోకి వచ్చినా ఆయనకు కేబినెట్ బెర్త్ గ్యారంటీ అన్నది అందరికీ తెలిసిందే. అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా ఆయన వ్యవహరించారు. స్పీకర్ గా పనిచేశారు. పాలన రాజ్యాంగం పట్ల ఆయనకు పూర్తి అవగాహన ఉంది. రాజకీయ మేధావిగా ఉన్నారు. దాంతో పాటు సామాజిక సమీకరణలు ఆయనకు కలసివస్తాయని అంటున్నారు. అయితే కాకినాడ పోర్టు విషయంలో ఆయన ఇటీవల చంద్రబాబుకు రాసిన ఒక బహిరంగ లేఖ వల్ల కొంత ఇబ్బంది అయితే వచ్చింది. దానిని లైట్ తీసుకుంటూ ఆయన పేరుని పరిగణనలోకి తీసుకుంటారా అన్నది చర్చగా ఉంది. ఇక రెండవవారు కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రిగా పనిచేసిన వారు. విశేష అనుభవం కలిగిన వారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి దాదాపు అర్థ శతాబ్దం పాటు రాజకీయ అనుభవం కలిగిన నేతగా ఉన్నారు. ఆయన కూడా టీడీపీ ఎపుడు గెలిచినా కీలక మంత్రిత్వ శాఖలు చూసిన వారుగా ఉన్నారు. రాజ్యాంగం పట్ల సాధారణ పరిపాలన పట్ల పూర్తి అవగాహన ఆయనకు ఉంది. పైగా చూస్తే క్షత్రియ సామాజిక వర్గం నుంచి ఈసారి ఎవరికీ మంత్రిగా తీసుకోలేదు. దాంతో రాజుకు గవర్నర్ పదవిని ఇచ్చేందుకే అలా చేశారు అని అంటున్నారు. ఇక చూస్తే ఆయన పార్టీకి సదా విధేయుడిగా ఉన్నారు. ఎపుడూ ఆయన మాట జారింది లేదు అని గుర్తు చేస్తున్నారు ఆయనకు టీటీడీ చైర్మన్ గా నియమించాలని అనుకున్నా ఆయన వద్దు అని సున్నితంగా పక్కన పెట్టేశారు. ఆయనకు గవర్నర్ గా పనిచేసి సంతృప్తికరమైన గౌరవమైన పదవీ విరమణ చేయాలని ఉందని అంటున్నారు. ఇక కేంద్రంలో నాలుగున్నరేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన ఆయన పనితీరు నిబద్ధత గురించి ప్రధాని మోడీకి కూడా బాగా తెలుసు అంటున్నారు. ఆయనకు గవర్నర్ పదవి అంటే మోడీ సహా కేంద్ర పెద్దలు కూడా పూర్తి స్థాయిలో హర్షించడమే కాకుండా కీలకమైన రాష్ట్రానికి నియామకం చేస్తారు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే ఢిల్లీలో రెండు రోజుల పర్యటనలో ఉన్న బాబుకు గవర్నర్ పదవి టీడీపీ కోటాలో అయితే ఆఫర్ గా ఇచ్చారు అని ప్రచారం సాగుతోంది. బాబు ఎవరి పేరు ప్రతిపాదిస్తే వారికే రాజ్ భవన్ లోకి ప్రవేశించే చాన్స్ అని అంటున్నారు. నూటికి తొంభై శాతం అశోక్ గజపతిరాజుకే గవర్నర్ పదవి ఆఫర్ ఉందని అంటున్నారు. బాబు కూడా ఆయన పేరునే ప్రతిపాదించవచ్చు అని చెబుతున్నారు. అదే కనుక జరిగితే రాజు గారు గవర్నర్ గా రాజ ఠీవితో రాజ్ భవన్ లోకి అడుగుపెడతారు అని అంటున్నారు.

### నేడు సీఎంతో సినీ ప్రముఖుల భేటీ

(1వపేజీ తరువాయి)మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తదితరులు పాల్గొననున్నారు. సినీ పరిశ్రమకు ఇన్సెంటివ్స్ ఇవ్వడం, పన్నుల విధానం, సౌకర్యాల అభివృద్ధి, అలాగే ఇతర సినీ పరిశ్రమకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. తెలంగాణలో బెనిఫిట్ షోలు రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిపైనా చర్చించే అవకాశం ఉంది. ఈ చర్చలు ప్రభుత్వం, సినీ పరిశ్రమ ప్రముఖుల మధ్య సానుకూలంగా జరిగే అవకాశం ఉంది. పలు సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

## చంద్రబాబుకు కీలక బాధ్యతలు

(1వపేజీ తరువాయి)చర్చించారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చడం, ఆర్థిక లోటును భర్తీ చేసేలా కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరారు. అంతేగాక, గత ఆరు నెలల్లో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతిని చంద్రబాబుప్రధాని మోడీకి వివరించినట్లు తెలిసింది. మరోవైపు, గత బడ్జెట్‌లో కేటాయించిన అంశాలను పూర్తి చేయడంతోపాటు ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో మరింత సాయం చేయాలని అడిగినట్లు సమాచారం. ప్రధాని మోడీతో భేటీ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చంద్రబాబు సమావేశమయ్యారు. అమిత్ షాతో సుమారు 45 నిమిషాల పాటు భేటీ అయిన చంద్రబాబు.. ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మరోవైపు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కేటాయింపులపై ఆర్థిక మంత్రి నిర్మలతో చర్చించినట్లు తెలిసింది. బుధవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని ఏపీ సీఎం చంద్రబాబు కలిశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ జరగకుండా చూడటంతోపాటు పలు అంశాలపై చర్చించారు. ఆ తర్వాత రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీకి రైల్వే జోన్ తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రైల్వే పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు తెలిసింది.

## ఏపీ సీఎస్‌గా సాయిప్రసాద్?

(1వపేజీ తరువాయి)శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉన్నారు. రేసులో సీనియర్లు శ్రీలక్ష్మీతో పాటుగా అజయ్ జైన్ కు అవకాశాలు లేవని ప్రభుత్వ వర్గాల సమాచారం. కేంద్ర సర్వీసు ల్లో ఉన్న సుమిత దావ్రా ఏపీకి వచ్చేందుకు సుముఖంగా లేరు. దీంతో, ఇప్పుడు 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారులుగా ఉన్న సాయిప్రసాద్, ఆర్పీ సిసోదియా తో పాటుగా 1992 బ్యాచ్ కు చెంది న విజయానంద్, బుడితి రాజశేఖర్ రేసులో ఉన్నారు. విజయానంద్ వచ్చే ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయనుండగా, సాయిప్రసాద్ 2026 మే లో, ఆర్పీ సిసోదియా 2028 జనవరిలో రిటైర్ కానున్నారు. ఈ లెక్కన ముందుగా పదవీ విరమణ చేసే వారి జాబితాలో విజయానంద్ ఉండటంతో పాటుగా ప్రభుత్వ సమీకరణాల మేరకు ఆయనకే సీఎస్ గా ఛాన్స్ దక్కుతుందని చర్చ సాగుతోంది. కానీ, సడన్ గా చంద్రబాబు మరో పేరు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. సాయి ప్రసాద్‌కే ఛాన్స్..? ఐఏఎస్ సాయి ప్రసాద్‌ను నూతన సీఎస్‌గా ఎంపిక చేయను న్నట్లు తెలుస్తోంది. 2014 లో నాడు చంద్ర బాబు అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర సర్వీసుల్లో ఉన్న సాయి ప్రసాద్ ను ఏరి కోరి తన పేషీకి తెప్పించుకున్నారు. 2014-19 వరకు సీఎం పేషీలో కీలకంగా వ్యవహరిం చారు. ఆ తరువాత జగన్ హయాంలో కూడా సీసీఎల్ఏ, రెవెన్యూ స్పెషల్ సీఎస్ గా రెండు బాధ్యతలూ నిర్వహించారు. తొలి నుంచి సాయి ప్రసాద్ పని తీరు పైన నమ్మకం ఉండటంతో.. ప్రస్తుత పరిస్థితుల్లో సాయి ప్రసాద్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లోనే ఏపీ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకం పైన అధికారికంగా నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

## ఎస్ఐ,మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

(1వపేజీ తరువాయి)చెప్పులు చెరువు వద్ద గుర్తించారు. సుమారు ఐదు గంటలకుపైగా ఎస్ఐ సాయికుమార్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. కాగా, పెద్ద చెరువులోని మృతదేహాలను వెలికి తీసేందుకు బుధవారం అర్ధరాత్రి వరకు పోలీసులు, సహాయక బృందాలు గాలింపు చేపట్టాయి. మహిళా కానిస్టేబుల్ శృతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. సాయికుమార్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. అయితే, వీరంతా ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారనేది ఇప్పటి వరకు తెలియరాలేదు.

సమాచార శాఖ మాజీ కమిషనర్


## విజయకుమార్ రెడ్డిపై ఏసీబీ కేసు!

(1వపేజీ తరువాయి)ఎన్డీఏ సర్కార్ తొలుత ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిపై కేసు పెట్టింది. ఆ తర్వాత మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఐపీఎస్ అధికారులు సంజయ్, సీతారామంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ ఇలా అఖిల భారత సర్వీసుల్లో పనిచేసిన అధికారులపై రకరకాల కేసులు పెట్టింది. ఇప్పుడు ఈ జాబితాలో సమాచార శాఖ మాజీ కమిషనర్ తమ్మా విజయకుమార్ రెడ్డి చేరారు. కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తున్న విజయ్ కుమార్ రెడ్డి గత ప్రభుత్వంలో డెప్యుటేషన్ పై రాష్ట్రానికి వచ్చారు. ఆయనను కీలకమైన సమాచార శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టుల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహించగా, తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ కొందరికి అయాచిత లబ్ధి చేకూర్చారని, ఐ అండ్ పీఆర్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగ నియమాకాల్లో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ప్రకటనల జారీలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ కు చెందిన మీడియా గ్రూపులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే కారణంతో ఓ పత్రికతోపాటు మూడు చానళ్లకు కనీసం రూపాయి కూడా ప్రకటనల కింద ఇవ్వలేదని, పాత బకాయిలు చెల్లించలేదని ఫిర్యాదులు వెళ్లాయి. ఓ పత్రిక, ఓ పార్టీకి చెందిన సోషల్ మీడియాలో పనిచేస్తున్న వారిని ఐ అండ్ పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులుగా నియమించినట్లు విజయ్ కుమార్ రెడ్డిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఏపీ మీడియా ఫెడరేషన్ దిల్లీబాబురెడ్డి ఫిర్యాదుచేయగా, సెప్టెంబర్ 14న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇది తాజాగా వెలుగులోకి వచ్చింది. ఐపీసీ 120బి (నేరపూరిత కుట్ర), అవినీతి నిరోధక చట్టంలోని 7, 13(2) రెడ్ విత్ 13(1) (ఎ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. ఐ అండ్ పీఆర్ కమిషనర్ గా పనిచేసిన విజయ్ కుమార్ రెడ్డి పక్షపాతంతో వ్యవహరించేవారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కొన్ని మీడియా గ్రూపులకు చెందిన పత్రికలు, చానళ్లకు ప్రకటనలు ఇవ్వొద్దని మౌఖిక ఆదేశాలిచ్చేవారని చెబుతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం లెక్కచేయకుండా సొంత నిర్ణయాలు తీసుకునేవారని విమర్శలు ఉన్నాయి. ఇక ఒక మీడియా గ్రూపు అడిగిన దానికంటే ఎక్కువగా ప్రకటనల ధర నిర్ణయించి ప్రభుత్వ ఖజానాకు రూ.19.63 కోట్లు నష్టం చేశారని ఏసీబీ కేసు నమోదు చేసింది.

## కేటీఆర్ చెప్పిండు..చేశా..

(1వపేజీ తరువాయి)ఉంది. మరోవైపు తమ పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ ద్వారానే ఎస్ఈవోకు దాదాపు రూ.55 కోట్ల నగదును బదిలీ చేశామని ఏసీబీ ముందు దానకిషోర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే ఆర్థికశాఖ అనుమతి పొందకుండా, కేబినెట్ నిర్ణయాలు తీసుకోకుండా ఎలా డబ్బులను రిలీజ్ చేశారని దానకిషోర్‌ను ఏసీబీ క్వశ్చన్ చేయగా.. కొంత రాజకీయ ఒత్తిళ్లతో పాటు, స్వయంగా కేటీఆర్ ఆదేశాల మేరకు నగదును విడుదల చేసినట్లు దానకిషోర్ చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే ఈకేసు తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చే సమయంలో దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచాలని ఏసీబీ భావిస్తున్నట్లు సమాచారం.

## రూ.26,999కే ఐఫోన్ 15.. ఫ్లిప్‌కార్ట్ బంపర్ ఆఫర్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐఫోన్ ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. దీంతో కొందరు బెస్ట్ డిస్కౌంట్స్ కోసం ఎదురుచూసి వాటిని సొంతం చేసుకుంటుంటారు. అలాంటి వారికి ఓ గుడ్ న్యూస్. గతేడాది మార్కెట్‌లోకి వచ్చిన ఐఫోన్ 15 (128)పై ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఊహించని



డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఈ ఫోన్‌ను రూ.27వేలకే అందిస్తోంది.సాధారణంగా %ఆఫ్ర్రశీఅవ 15 128+దీ% ధర రూ.69,990. ఈ ప్రీమియం డివైజ్ ఇప్పుడు పలు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను కలుపుకుని కేవలం రూ. 26,999కే ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. అందుకోసం మనం ఐఫోన్ 14ను ఎక్స్ఛేంజ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూ. 26,999కే మీ సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది.

## లోయలో పడిన బస్సు.. ముగ్గురు మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:**ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నైనిటల్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది . ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. బస్సు 27 మంది ప్రయాణికులతో అల్మోరా నుంచి హల్ద్వానీకి వెళ్తోంది. భీమ్‌తల్ నగర సమీపంలోని రాగానే బస్సు ఓ వంపు వద్ద అదుపుతప్పి 1,500 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 24 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 15 అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకొన్నాయి. క్షతగాత్రులను రోప్‌ల సాయంతో రక్షించి ఆసుపత్రికి తరలించారు.

## ఆ పబ్లిక్ నోటీసులు తప్పుడువి.. ఇదంతా బీజేపీ కుట్ర : ఢిల్లీ సీఎం అతిషి




**న్యూఢిల్లీ-నవభూమి:** పత్రికల్లో వచ్చిన పబ్లిక్ నోటీసులు తప్పుడువని, అదంతా బీజేపీ కుట్ర అని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని బ్లేమ్ చేయడం కోసం బీజేపీ నేతలు కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పబ్లిక్ నోటీస్‌లు వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. మహిళా సమ్మాన్ యోజన, వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకాలను నోటిఫై చేయలేదని ఢిల్లీ ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసింది.ఆ నోటీస్ ఢిల్లీలోని అన్ని ప్రధాన పత్రికల్లో అచ్చయ్యింది. దాంతో ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కుతున్నారని, మహిళా సమ్మాన్ యోజన పథకాన్ని నోటిఫై చేయలేదని ఆప్ సర్కారు పబ్లిక్ నోటీస్ ఇవ్వడం ద్వారా ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ సీఎం అతిషి స్పందించారు.'ఇవాళ వార్తా పత్రికల్లో అచ్చయిన పబ్లిక్ నోటీస్‌లు తప్పుడువి. బీజేపీ నేతల ఒత్తిడి మేరకు ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఆ నోటీస్‌లు ఇచ్చారు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ తప్పుడు నోటీస్ ఇచ్చిన అధికారులపై పాలనా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారు. మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలు ఇప్పటికే ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాయి. వాటిని కచ్చితంగా అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం అతిషి హామీ ఇచ్చారు.

## వాజ్‌పేయీ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం విడుదల




**న్యూఢిల్లీ-నవభూమి:** దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయీ 100వ జయంతి నేడు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. వాజ్‌పేయీ వందవ జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రిలీజ్ చేశారు. అంతేకాకుండా స్టాంప్‌ను కూడా మోదీ విడుదల చేశారు.మరోవైపు వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్చాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓం బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, హెచ్‌డీ కుమార స్వామి ఇతర కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ , బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

## గోవాలో టూరిస్ట్ పడవ బోల్తా, ఒకరు మృతి, 20 మంది సురక్షితం

**పనాజి-నవభూమి:** క్రిస్మస్, న్యూఇయర్ సెలబ్రేషన్ల కోసం గోవా బీచ్‌కు పర్యటకులు పెరుగుతున్న వేళ బుధవారంనాడు విషాద ఘటన చోటుచేసుకుంది. నార్త్ గోవాలోని కాలంగుటె బీచ్ అరేబియన్ సముద్రంలో పర్యాటకుల పడవ బోల్తా పడి ఒకరు మరణించారు. 20 మందిని రెస్క్యూ టీమ్ కాపాడింది. మరణించిన వ్యక్తిని 54 ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

పడవ ప్రమాదంలో రక్షించిన 20 మందిని సమీప ఆసుపత్రికి తరలించామని, ప్రయాణికుల్లో ఇద్దరు మినహా పిల్లా పెద్దలందరూ లైఫ్ జాకెట్లు వేసుకున్నట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. తీర ప్రాంతానికి సుమారు 60 మీటర్ల దూరంలో పడవ బోల్తాపడిందని, దీంతో అందరూ సముద్రంలో పడిపోయారని లైఫ్ సేవింగ్ ఏజెన్సీ దృష్టి మెరైన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పడవలోని 13 మంది మహారాష్ట్రలోని ఖేడ్ నుంచి వచ్చారని, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని వివరించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే విధి నిర్వహణలో ఉన్న 18 మంది లైఫ్‌సేవర్లు ప్రయాణికులను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారని, వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి కొందరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామని చెప్పారు.




# కెనడాతో కాలు దువ్వుతున్న ఈడీ.. మానవ అక్రమ రవాణా..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశమైన కెనడాతో భారత్ కు గతంలో మంచి స్నేహ సంబంధాలు ఉండేవి. అయితే, ఎప్పుడైతే జస్టిన్ ట్రూడో కెనడా ప్రధాని అయ్యారో అప్పటినుంచి బంధం బీటలు వారింది. గత ఏడాది కాలంగా మరింత లోతుల్లోకి వెళ్లిపోయాయి. మరీ ముఖ్యంగా కెనడాలో ఖలిస్థానీల హత్య వెనుక భారత్ ఉందంటూ ట్రూడో ప్రభుత్వం ఆరోపణలు చేయడం పరిస్థితులను దిగజార్చింది. ఇక ట్రూడో భారత్ లో సదస్సుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొనడం నుంచి మన దేశ రాయబారులను బహిష్కరించడం వరకు ఓ సమరమే జరిగింది. కాలుదువ్వినదెవరు? కెనడా కేంద్రంగా ఖలిస్థానీలు కొన్నేళ్లుగా తమ స్వరాన్ని గట్టిగా వినిపిస్తున్నారు. వారు బహిరంగంగానే తమ నిరసనలను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ తగు విధంగా స్పందించింది. అయితే, తాజాగా కెనడా తమ దేశంలో శాశ్వత నివాసితులు (పీఆర్-పర్మినెంట్ రెసిడెంట్స్) విధానాన్ని కఠినం చేసింది. ఇది ప్రధానంగా భారతీయ విద్యార్థులను మనసులో ఉంచుకునే అనేది తెలిసిపోతోంది. కాలేజీలపై ఈడీ నిఘా ఇరు దేశాల సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో కెనడా సరిహద్దు మీదుగా భారతీయులను అమెరికాకు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులు, సంస్థలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి డబ్బు చేతులుమారిన వైనంపై దర్యాప్తు చేస్తోంది. కెనడాలోని కొన్ని కాలేజీలు, భారత సంస్థల పాత్రపై విచారణ చేపట్టింది ఆత్మహత్యా..? కదిలించిన ఆ కేసే మూలం.. సరిగ్గా మూడేళ్ల కిందట.. 2022 జనవరి 19న గుజరాత్ కుటుంబం కెనడా సరిహద్దు నుంచి అమెరికాలోకి ప్రవేశించబోయి తీవ్రమైన మంచు కారణంగా చనిపోయింది. ఈ కేసును ఆధారంగా చేసుకొని ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు భవేష్ పటేల్‌తో పాటు మరికొందరిపైనా ఈడీ కేసు నమోదు చేసింది. నిందితులు మానవులను అక్రమంగా తరలించే సంస్థలతో కలిసి కుట్ర పన్ని.. భారత ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని దేశ సరిహద్దులు దాటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాంటివారిని కెనడా మీదుగా అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. కెనడా, అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని, విదేశాల్లో స్థిరపడాలని కోరుకునే భారతీయులను ట్రాప్ చేస్తున్నట్లు తమ దర్యాప్తులో కనుగొన్నట్లు చెప్పారు. వ్యక్తి నుంచి రూ.55 - రూ.60 లక్షల వరకు వసూలుచేసినట్లు వెల్లడించారు. విద్యార్థి వీసాపై కెనడా వెళ్లినవారు అక్కడి విశ్వవిద్యాలయాల్లో చేరట్లేదన్నారు. దీంతో కాలేజీలు వారి నుంచి తీసుకున్న అడ్మిషన్ ఫీజును తిరిగి ఆయా వ్యక్తుల ఖాతాల్లో జమ చేసేవారని తెలిపారు. అలా వెళ్లినవారు చట్టవిరుద్ధంగా కెనడా యూఎస్ సరిహద్దును దాటుతున్నారని తెలిపారు. విదేశాల్లోని యూనివర్సిటీల్లో భారతీయులకు ప్రవేశం ఇప్పించడానికి ముంబయి, నాగ్‌పుర్ ఉన్న రెండు సంస్థలు పని చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. వీరు ఏటా దేశంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 35వేల మంది విద్యార్థులను దేశం దాటిస్తున్నారని తెలిపారు.

## ఆర్మీ ఆఫీసర్ అమితాబ్ జా మృతి పట్ల యూఎన్ సెక్రటరీ జనరల్ నివాళి



న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితికి చెందిన పీస్‌కీపింగ్ దళంలో కమాండర్‌గా చేస్తున్న భారతీయ ఆర్మీ ఆఫీసర్, బ్రిగేడియర్ అమితాబ్ జా ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతి పట్ల యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నివాళి అర్పించారు. సంక్లిష్టమైన సిరియా-ఇజ్రాయిల్ సరిహద్దు సమీపంలో .. యూఎన్ పీస్‌కీపింగ్ ఫోర్స్‌కు అమితాబ్ జా నాయకత్వం వహించారు. యూఎన్ డిస్ఎంగేజ్మెంట్ అబ్జర్వర్ ఫోర్స్‌కు తాత్కాలిక కమాండర్‌గా చేశారాయన. అయితే ఆయన ఆకస్మికంగా మృతి చెందడం పట్ల సెక్రటరీ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిన సమయంలో.. యూఎన్డీఓఎఫ్‌కు యాక్టింగ్ ఫోర్స్ కమాండర్‌గా అమితాబ్ చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో డిప్యూటీ ఫోర్స్ కమాండర్‌గా చేరారు. అయితే సిరియాలో సంక్షోభం ఏర్పడిన సమయంలో ఆ దళానికి ఆయన యాక్టింగ్ చీఫ్‌గా చేశారు. యూఎన్‌డీఓఎఫ్ దళాన్ని 1974లో ఏర్పాటు చేశారు. భద్రతా మండలి ఆధ్వర్యంలో ఆ దళం .. ఇజ్రాయిల్, సిరియా సరిహద్దుల్లో కాల్పుల విమరణ చేపట్టేలా చూసుకుంటుంది. యూఎన్డీఓఎఫ్ దళంలో 201 మంది భారతీయ సైనిక సిబ్బంది ఉన్నది. ఆ దళంలో వివిధ దేశాలకు చెందిన 1117 మంది సైనికులు ఉన్నారు.

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు.. విమానాల రాకపోకలకు అంతరాయం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఆవరించింది. ఓ వైపు ఆకాశం మేఘావృతమై ఉండగా.. మరో వైపు చలితో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం రాత్రి నగరంలో పలుచోట్ల జల్లులు కురవడంతో నగరం ఒక్కసారిగా చలి కొనసాగుతున్నది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 22 డిగ్రీలు, కనిష్ఠంగా 9 డిగ్రీల వరకు ఉండొచ్చని చెప్పింది. ఈ సీజన్‌లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ మంగళవారం రాత్రి ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. సెంట్రల్, సౌత్, ఈస్ట్ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వానపడింది. గరిష్ట ఉష్ణోగ్రత 20.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సీజన్‌లో సాధారణం కంటే గరిష్ఠ ఉష్ణోగ్రత కావడం విశేషం. ఇక ఢిల్లీలో వాయు కాలుష్యం స్వల్పంగా తగ్గింది. బుధవారం 6 గంటలకు ఏక్యూఐ 363గా నమోదైంది. ప్రస్తుతం ఢిల్లీలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలవుతున్నది. ఇందులో భాగంగా నిర్మాణ కార్యకలాపాలపై పూర్తిగా నిషేధం అమలులో ఉంటుంది. నగరంలో ట్రక్కులు ప్రవేశించకుండా నిషేధం ఉంటుంది. విమానాల రాకపోకలకు అంతరాయం.. నగరవ్యాప్తంగా భారీగా పొగమంచు నేపథ్యంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు తెలిపింది. విమానాలు ఆలస్యం కావడంతో పాటు రద్దయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. అప్‌డేట్స్ కోసం విమానాయాన సంస్థలను సంప్రదించాల్సిందిగా ప్రయాణికులకు సూచించింది. విమాన షెడ్యూల్‌ల కోసం విమానయాన సంస్థలతో తనిఖీ చేయాలని ప్రయాణికులను కోరారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు.. విమాన స్టేటస్‌ని చూసుకోవాలని కోరింది. పొగమంచు కారణంగా రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. పొగమంచు కారణంగా ఢిల్లీకి వెళ్లే కనీసం 20 రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రభావిత రైళ్లలో గోవా ఎక్స్‌ప్రెస్, పూర్వా ఎక్స్‌ప్రెస్, కాళింది ఎక్స్‌ప్రెస్ మరియు రేవా-ఆనంద్ విహార్ టెర్మినల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

## కారును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు.. ఐదుగురు మృత్యువాత




**న్యూఢిల్లీ-నవభూమి:**రాజస్థాన్ కరౌలీ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. అతివేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు కారును ఢీకొట్టింది. కరౌలీ-గంగాపూర్ హైవేపై సాలెంపూర్ వద్ద జరిగిన ఘటన జరిగింది. ఇందులో కారులో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. కారు గంగాపూర్ నుంచి కరౌలి వైపు వెళ్తుండగా ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఎదురుగా వస్తున్న బస్సు అతివేగంతో వచ్చి కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు.

ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతులను గుజరాత్‌కు చెందిన వారుగా గుర్తించారు. వారంతా గతంలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నివాసం ఉండేవారని.. ప్రస్తుతం గుజరాత్ వడోదరలో నివాసం ఉంటున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు. బస్సు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి.. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు పోలీసులు. మృతుల బంధువులకు సమాచారం అందించిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## ట్రంప్ మరో సంచలనం.. వారికి మరణశిక్షలు విధిస్తాం



**అమెరికా-నవభూమి:**కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 2024కు గుడ్ బై చెప్పేస్తూ.. కొత్తగా రానున్న 2025కు వెల్ కం చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ.. కొత్త సంవత్సరంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్న డొనాల్డ్ ట్రంప్.. పదవీ బాధ్యతలు చేపట్టక ముందే వరుస పెట్టి సంచలన ప్రకటనలు చేస్తున్న సంగతి తెలిసిందే. తన పాలన ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఆయన క్లారిటీ ఇచ్చేస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టే మొదటి రోజు నుంచే దూకుడుగా వ్యవహరించాలన్న ఆలోచనలో ఉన్న ట్రంప్ అందుకు తగ్గట్లే.. గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. సౌత్‌పై కేంద్రం స్పెషల్ ఫోకస్.. కేరళకు గుడ్‌న్యూస్ మొదటి రోజునే తన పాలనకు సంబంధించిన పాలసీలపై ఎప్పటికప్పుడు తన అభిప్రాయాన్ని నికచ్చిగా చెప్పేస్తున్న ట్రంప్.. తొలి రోజునే పదుల సంఖ్యలోని ఫైళ్లపై సంతకాలు చేసేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఇరుగు పొరుగు దేశాలతో పాటు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు దేశాలతో అమెరికా సంబంధాలు తన హయాంలో ఎలా ఉంటాయన్న దానిపై క్లారిటీ ఇస్తున్న ఆయన వ్యాఖ్యలు సంచలనంగా మారుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలుగుతున్న జో బైడెన్.. ఫెడరల్ మరణ శిక్షను ఎదుర్కొంటున్న నలభై మంది ఖైదీల్లో 37 మందికి మరణశిక్షను తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టులో.. "జో బైడెన్ దేశంలోని 37 మంది హంతకులకు మరణశిక్షను తగ్గించారు. నేను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వెంటనే రేపిస్టులు.. హంతకులకు మరణ శిక్ష అమలు చేయాలని న్యాయశాఖను ఆదేశిస్తా. ఈ చర్య అమెరికన్ ప్రజలను రక్షిస్తుంది. దేశంలో మళ్లీ శాంతిభద్రతలు పునరుద్ధరిస్తా" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అమెరికా విషయానికి వస్తే.. ఆ దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు.. చట్టాలు ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే మరణశిక్షల్ని అమలు చేస్తున్నారు. తోటి ఖైదీల్ని హత్య చేయటం.. బ్యాంకు దోపిడీల వేళ హత్యలకు పాల్పడిన వారికి మాత్రమే మరణశిక్షల్ని అమలు చేస్తున్నారు. దీని కారణంగా 1988నుంచి 2021 వరకు మొత్తం 79 మందికి మరణశిక్షను విధించారు.అయితే.. అత్యంత అరుదుగానే మరణశిక్షల్ని అమలు ఉంటుంది. శిక్ష పడినోళ్లలో ఇప్పటివరకు 16 మందికి మాత్రమే శిక్ష అమలు చేశారు. .ఎర్ర సముద్రంలో రక్తం పారించిన రష్యా ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చే వరకు ఫెడరల్ ఖైదీలకు మరణశిక్షను అమలు చేయలేదు. కానీ.. ఆయన అధికారాన్ని చేపట్టిన ఆర్నెల్ల వ్యవధిలోనే 13 మందికి మరణశిక్షను అమలు చేశారు. చివరి మరణశిక్ష 2021 జనవరి 16న అమలైంది. తాజాగా జో బైడెన్ 37 మందికి మరణ శిక్ష నుంచి తక్కువ శిక్షకు తగ్గించిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్య సంచలనంగా మారింది.

## బీజేపీకి పిచ్చిపట్టింది.. ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడంలేదు : సంజయ్ సింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీయ జనతా పార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీసీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి పిచ్చిపట్టిందని, ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదని ఫైరయ్యారు. 'మహిళా సమ్మాన్ యోజన' పథకం అమలులో లేదని, ఇకముందు కూడా అమలు చేయబోవడం లేదని ఢిల్లీకి చెందిన మహిళాశిశు సంక్షేమ శాఖ మంగళవారం ఒక పబ్లిక్ నోటీస్‌ను విడుదల చేసింది. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండటంతో సంజయ్ సింగ్ స్పందించారు.బీజేపీ ఒక అబద్ధాలకోరు పార్టీ అని, ఆ పార్టీ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆప్ నేత మండిపడ్డారు. బీజేపీ నేతల ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా పబ్లిక్ నోటీస్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు బీజేపీ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మబోరని చెప్పారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, బీజేపీ మాత్రం కేంద్రంలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు.'బీజేపీకి పిచ్చిపట్టింది. బీజేపీ నేతల మెదళ్లు పనిచేయడంలేదు. బీజేపీ నేతల ఒత్తడికి తలొగ్గి తప్పుడు పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా.. ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు, ఉచిత విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారు. కేజ్రీవాల్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సమ్మాన్ యోజన పథకం కూడా అమల్లోకి వస్తుంది. ఈ పథకం కేవలం హామీ కాదు. ఒక గ్యారంటీ' అని చెప్పారు.'భారతీయ ఝూటా పార్టీ (బీజేపీని ఉద్దేశించి) ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చింది. విదేశీ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్ మనీని బయటికి తీసుకొస్తామని చెప్పింది. రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రచారం చేసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని తెలిపింది. కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా బీజేపీ నెరవేర్చలేదు. దేశాన్ని నాశనం చేశారు. పైగా వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తారు. వాళ్ల అబద్ధాలను జనం నమ్మే పరిస్థితిలో లేరు' అని సంజయ్ సింగ్ అన్నారు.

## మొబైల్ టవర్ బ్యాటరీలు చోరీ.. 9 మంది అరెస్టు



**పాల్గర్-నవభూమి:** మొబైల్ ఫోన్ టవర్లకు చెందిన సర్వర్ రూముల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను మహారాష్ట్ర పోలీసులు పట్టుకున్నారు. ఆ ముఠాలోని 9 మంది సభ్యుల్ని అరెస్టు చేశారు. పాల్గర్ జిల్లాలో వాళ్లను అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 5వ తేదీన బాలివాలి గ్రామంలో ఉన్న మొబైల్ టవర్ సర్వర్ రూమ్ నుంచి సుమారు 12వేలు ఖరీదైన 24 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. టవర్ క్యాబిన్ తాళం పగులగొట్టి, బ్యాటరీలను చోరీ చేస్తున్నారని పోలీసు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ బదాక్ తెలిపారు. మాండ్వి పోలీసులు 303(2) చోరీ కేసు బుక్ చేసి దర్యాప్తు చేపడుతున్నారు.మొబైల్ టవర్ల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్తున్న ఘటనలు ఇటీవల పాల్గర్ సమీపంలో ఎక్కువయ్యాయి. దీంతో పోలీసులు దొంగల కోసం గాలింపును ముమ్మరం చేశారు. సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్, నిఘా ఇంటెలిజెన్స్ ద్వారా దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంట్లో ఇద్దరు స్క్రాప్ డీలర్లు కూడా ఉన్నారు. నిందితుల్ని విచారిస్తున్న సమయంలో.. అనేక విషయాలు వెలుగు చూశాయి. వాసాయి, విరార్, వాడా, బోయిసర్ ప్రాంతాల్లో జరిగిన బ్యాటరీ చోరీలు తామే చేసినట్లు పేర్కొన్నారు. మాండ్వి, విరార్, పెల్హార్, నయిగావ్, బోయిసర్ లో ఆరు కేసులు బుక్కయ్యాయి.

## పార్లమెంట్ సమీపంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ భవనం సమీపంలో కలకలం రేగింది. ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. లోకల్ పోలీసులు, రైల్వే పోలీసులు, స్థానికులు తక్షణమే స్పందించి మంటలను ఆర్పేశారు. అతడిని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.ఘటనకు పాల్పడిన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బాగ్‌పట్ జిల్లాకు చెందిన జితేంద్రగా గుర్తించారు. పార్లమెంట్ సమీపంలోని రైల్వే భవన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే జితేంద్ర ఎందుకు అక్కడికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

## 3 ఏళ్ల పాప.. 700 ఫీట్ల లోతు బోర్‌వెల్‌లో.. 20 గంటలుగా.. కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



**జైపూర్-నవభూమి:** రాజస్థాన్‌లో మూడేళ్ల చిన్నారి.. బోర్‌వెల్‌లో పడింది. ఆ పాప కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. కోట్‌పుత్లి-బెహ్రోర్ జిల్లాలోని 700 ఫీట్ల బోర్‌వెల్‌లో సుమారు 150 ఫీట్ల లోతులో ఆ అమ్మాయి చిక్కుకున్నది. ఆ చిన్నారిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి.ఆ చిన్నారి పేరు చేతన. తండ్రికి చెందిన ఫార్మ్‌లో ఆడుతుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆ చిన్నారి బోర్‌వెల్‌లో పడిపోయింది. కెమెరా ద్వారా ఆ పాప మూమెంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆక్సిజన్ పైప్ ఆ బోర్‌వెల్‌లోకి వేశారు. తొలుత ఆ బోర్‌వెల్‌ను తొవ్వేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడ ఉన్న మట్టి కూరుకుపోతున్న కారణంగా రెస్క్యూ ఆపరేషన్ కష్టంగా మారింది.ఓ రాడ్డుకు హుక్ పెట్టి ఆ పాపను బయటకు తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే రాజస్థాన్‌లో ఓ బోర్‌వెల్ ఘటన జరిగింది. దౌసా జిల్లాలో అయిదేళ్ల చిన్నారి ఓ బోర్‌వెల్‌లో చిక్కుకున్నారు. ఆర్యన్ అనే అబ్బాయిని సుమారు 56 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత రక్షించారు. కానీ ఆ చిన్నారి మృతిచెందినట్లు ఆస్పత్రిలో డాక్టర్లు చెప్పారు.

# ఆ ధనరాశులు ఎక్కడివి?

'సోలార్' కరెంటుని సప్లై చేసే కాంట్రాక్టుల కోసం, అదానీ అనే ఒక పెద్ద పెట్టుబడిదారుడు, దేశంలోని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు దాదాపు రెండు వేల కోట్ల రూపాయల లంచాలిచ్చాడని, వారం కిందట పత్రికలూ, టీవీలూ సరికొత్త వార్తలిచ్చాయి! 'అదానీ లంచాల కహానీ' అనీ, 'లంచాల అవదానీ' అనీ, సరదా శీర్షికలు పెట్టి మరీ! లంచాల వార్తల వెనక ఒక పెద్ద కథ వుంది! అదేమిటంటే, సూర్యుడి వల్ల వచ్చే ఎండ వేడినించీ కరెంటుని(సోలార్ ఎనర్జీని) తయారు చేయించడం కోసం, అదానీ కంపెనీ, ప్రపంచ వ్యాప్తంగా, 6 వేల, 3 వందల కోట్ల పెట్టుబడులు సేకరించిందట! వాటిల్లో 15 వందల కోట్లని అమెరికాలోని బ్యాంకుల నించీ, అక్కడి ఇతర ఆర్థిక సంస్థల నించీ కూడా! అలా అమెరికా నించీ నిధులు సేకరించిన స్వదేశీ, విదేశీ కంపెనీలు ఏవైనా, తమ వ్యాపార ప్రయోజనాల కోసం, ఏ దేశంలో అయినా, ప్రభుత్వనేతలకు గానీ, అధికారులకు గానీ, లంచాలుగా ఇచ్చినా, ఇస్తానని ఆశజూపినా, అది అమెరికాలో ఒక చట్టం ప్రకారం పెద్ద నేరం అట! అందుకే, అదానీ కంపెనీ మీద అమెరికా కేసులు పెట్టింది. అదానీ నేరం కొన్ని సంవత్సరాల క్రితమే జరిగినా, అదానీ మీద వున్న అమెరికా కేసుల వివరాలు మొన్నీ మధ్యే బయటపడడంతో, భారతదేశంలో ప్రతిపక్షాలు, అదానీ మీద, కేంద్ర ప్రభుత్వం, అరెస్టుతో సహా, చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాయి. అదానీ, మోదీకి అత్యంత సన్నిహిత పెట్టుబడిదారీ మిత్రుడు కాబట్టి, అతని మీద ప్రభుత్వం చర్యలు తీసుకోదని ప్రతిపక్షాలకు గట్టి అనుమానాలు!అదానీ ఇచ్చిన లంచాల వ్యవహారం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ వున్న కాలంలో జరిగిందట! 'జగన్‌కి 1750 కోట్లు' లంచంగా ముట్టిందట! ఏది ఏమైనా, ఆ లంచాలు ఎవరు ఎవరికి ఇచ్చారో, ఎంత ఇచ్చారో, నోట్ల రూపంలో ఇచ్చారా, బంగారు నాణాల రూపంలో ఇచ్చారా, బహుమతుల రూపంలోనా, ఏ రూపాల్లో ఇచ్చారోబీ ఆ లంచాలు తీసుకున్న వాళ్ళు వాటిని ఎక్కడ ఎలా దాచుకున్నారో- ఆ వివరాలన్నీ మనకి అనవసరం. 'మనకి' అంటే, 'శ్రామిక ప్రజలకు' అని. శ్రామిక ప్రజలు అంటే, రకరకాల స్థాయిల్లో, ఇటూ, అటూ, మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ చేసేవారు అనే కదా? ఆ లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధనరాసులు, ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయియా, ఎక్కణ్ణించీ వచ్చాయియా అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: 'ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు' -అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు, 'లాభాల' డబ్బు గురించే! అయినా, లాభం రావడం చాలా సహజమైన విషయం అయినట్టే, పెట్టుబడికి వడ్డీ లాభాలు రావా, రావొద్దా- అని, ప్రపంచ జనం, ఆర్థికవేత్తలతో సహా అందరూ అనేస్తారు, భావిస్తారు! లాభానికి వున్న మూల కారణం గురించి, దాని రహస్యం గురించి 160 ఏళ్ళ క్రితం, మార్క్సు వచ్చి చెప్పేవరకూ ఎవరికీ సరిగా తెలీనే తెలీదు. ఈ సోలార్ కరెంటు పరిశ్రమనే ఉదాహరణగా తీసుకుని, ఆ రహస్యం ఏమిటో తెలుసుకో గలం, మార్క్సుని చదివి.ఏ పరిశ్రమలో అయినా, అది ఒక్క నిమిషం నడవాలన్నా, దానికి 2 అంశాలు కావాలి! సోలార్ పరిశ్రమకీ అలాగే, 2 అంశాలే! (1) కరెంటుని తయారు చేయడానికి మొట్టమొదట కావలిసిన 'సాధనాలు'. ఆ సాధనాలకి ఏవో పేర్లు వుంటాయి. సోలార్ పానల్సూ, మిరర్సూ, ఇన్వర్టర్లూ, వైర్లూ, గ్రిడ్లూ, మీటర్లూ, బ్యాటరీలూ, వగైరా వగైరాలు. ఆ సాంకేతిక వివరాలు దేనికైనా వుంటాయి. అవి అనవసరం. 'ప్రారంభ పదార్థం' ఇక్కడ సూర్యుడి నించీ వచ్చే ఎండే! ఎండ బాగాపడే అనేక ఎకరాల, విశాలమైన భూమి కూడా సహజ సాధనంగా కావల్సిందే ఇక్కడ. (2) ఆ సాంకేతిక సాధనాలతో సోలార్ కరెంటుని తయారు చేసి, దాన్ని నిల్వచేసి, దాన్ని పంపిణీ కూడా చేయడానికి ఎంతోమంది ఇంజినీర్లూ, రకరకాల టెక్నీషియన్లూ, నైపుణ్యం గల కార్మికులూ, సాధారణ శ్రమల కార్మికులూ కూడా ఎందరో కావాలి. వాళ్ళకి జీతాలు ఇస్తేనే, వాళ్ళకి పోషణ కదా? కాబట్టి, మొదట సాధనాలకు అయ్యే ఖర్చూ, తర్వాత శ్రామికులకు ఇచ్చే జీతాల ఖర్చూ- ఈ 2 ఖర్చులే 'పెట్టుబడి' అవుతాయి. ఈ పెట్టుబడి, ఎంత వుండాలో, జరగవలిసిన పనినిబట్టే కదా? ఎంత భూమిలో, ఎన్ని సాధనాలతో, ఎంత మంది కార్మికులతో, ఎంత 'సోలార్ కరెంటుని' తయారు చేయించాలనుకుంటారో, దానిని బట్టి ఎంత డబ్బు కావాలో వుంటుంది.ఉదాహరణకి, బాగా ఎండలు వుండే రాజస్తాన్‌లో, 14 వేల ఎకరాల్లో, సోలార్ పరిశ్రమ పెట్టాలంటే, 50 వేల కోట్లు అవుతుందని ఒక లెక్క-అట! ఆ లెక్కల వివరాల గందరగోళంలోకి మనం, ఇంతకన్నా వెళ్ళొద్దు. ఎందుకంటే, ఎవరు ఎంత పెట్టుబడిని పోగుచేసుకోగలిగితే, దాన్ని బట్టి పరిశ్రమని చిన్నదో, పెద్దదో పెట్టుకుంటారు.ఇక్కడ మన ప్రశ్న: లంచాల్ని ఐదో, పదో కాకుండా, కోట్లలో ఇవ్వాలంటే, వాళ్ళు భారీ పరిశ్రమ పెట్టాలి. దానికి భారీ పెట్టుబడి డబ్బు కావాలి కదా? ఈ గోలంతా ఎందుకంటే, ఏ పరిశ్రమకి అయినా, చివరికి లాభం ఎలా వస్తుందో తెలియడానికి. లాభం గురించి తెలిస్తే, లంచం గురించి తెలుస్తుంది. కాబట్టి, అసలు తెలుసుకోవలిసిన రహస్యం, లాభం ఎలా వస్తుంది?- అనే గానీ, కోట్ల కోట్ల లంచాలు ఎలా ఇస్తారు- అని కాదు. సోలారు కరెంటు పరిశ్రమని ఒక ఉదాహరణగా చెప్పుకుందాం. ఈ పరిశ్రమలో, సోలార్ కరెంటుని తయారు చేయడానికి, సాధనాల కోసం ఖర్చుని 80 అనుకుందాం. ఆ సాధనాలను ఉపయోగిస్తూ, సోలార్ కరెంటు తయారవడానికి అవసరమైన 'శ్రమలు' చేసే కార్మికులందరి జీతాలూ కలిసి 20. ఇది రెండో ఖర్చు. 2 ఖర్చులూ కలిసి 80ం20=100. ఇదే పెట్టుబడి. కరెంటు తయారైంది. ఇదే కొత్త సరుకు. దీన్ని అమ్మడానికి పెట్టుబడిదారుడే ధరని నిర్ణయిస్తాడు. ఇక్కడ ఈ సరుకు ధర 120. ఈ ధరతో అమ్మకం జరుగుతుంది.

# సూడాన్ దేశంలో హడలెత్తిస్తున్న కరువు.



సూడాన్ ఇటీవలి చరిత్రలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆకలి సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. సుదీర్ఘమైన కరువుతో అల్లాడుతుంది. మానవతా సహాయం లేకుంటే వందల, వేల మంది ఆకలితో మరణించవచ్చు. ముగ్గురు పిల్లలలో ఒకారు తీవ్రమైన పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు. "కరువు మానవ బాధ యొక్క అత్యంత తీవ్రమైన వ్యక్తీకరణ. ఇది మనుగడకు అవసరమైన వ్యవస్థలు, వనరుల వినాశకరమైన పతనాన్ని సూచిస్తుంది" అని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా నివేదిక పేర్కొంది. ఐపిసి కరువు సమీక్షా కమిటీ తాజా నివేదిక సూడాన్ లో కనీసం ఐదు ప్రదేశాలలో కరువు పరిస్థితులు ఉన్నాయని సూచిస్తున్నాయి. వీటిలో ఉత్తర డార్ఫూర్ లోని స్థానభ్రంశం శిబిరాలు, దక్షిణ కోర్డోఫాన్ లోని పశ్చిమ నుబా పర్వతాలు ఉన్నాయి. రాబోయే నెలల్లో మరో ఐదు ప్రాంతాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గుర్తించారు. ఇది కేవలం ఆహారం లేకపోవడం మాత్రమే కాదు, ఆరోగ్యం, జీవనోపాధి, సామాజిక నిర్మాణాలను తీవ్రంగా విచ్ఛిన్నం చేస్తుంది. మొత్తం సమాజాలను నిరాశా నిస్పృహలో ఉంచుతుంది. భద్రతా పరిస్థితులు అనుమతించిన ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం వ్యవసాయానికి మద్దతు ఇచ్చినప్పటికీ, కొనసాగుతున్న సంఘర్షణ వ్యవసాయ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించింది. రైతులు పొలాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని, పంటలను కొల్లగొట్టారని లేదా నాశనం చేశారని నివేదిక తెలిపింది. నిర్వాసిత కుటుంబాలు, ముఖ్యంగా జనావాసాలు, ప్రభుత్వ భవనాలలో ఉన్నవారు పంట యొక్క ప్రయోజనాలకు దూరంగా ఉన్నారు.

**క్షీణిస్తున్న ఆహార భద్రత:**

ఐపిసి ఫేజ్ 4 (ఎమర్జెన్సీ) లో 81 లక్షల మంది, ఫేజ్ 5 (విపత్తు) లో 6,38,000 మంది ఉన్నారు. ఫేజ్ 3 (సంక్షోభం) లో 1.59 కోట్లకు పెరిగింది. ఐపిసి ఫేజ్ 3 క్లిష్టమైన ఆహార అంతరాలు లేదా సంక్షోభ వ్యూహాలపై ఆధారపడటం ద్వారా గుర్తించబడుతుంది. ఫేజ్ 4 తీవ్రమైన పోషకాహార లోపం లేదా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే స్థితిని కలిగి ఉంటుంది. ఫేజ్ 5 ఆకలి, మరణంతో పాటు తీవ్రమైన పోషకాహార లోపంతో కరువును సూచిస్తుంది. ఐపీసీ ప్రకారం



దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఆహారం, పౌష్టికాహారం అందుబాటులో క్షీణిస్తుండటంతో సూడాన్ లో ఆహార భద్రత పరిస్థితి వేగంగా క్షీణించడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తం చేశారు.

**దీనికి కారణం:**

సూడాన్ దేశంలో ప్రస్తుత పరిస్థితికి కారణం అధికారం, పలుకుబడి కోసం ఇద్దరి వ్యక్తుల మధ్య ఆధిపత్య పోరు. వీరిలో ఒకరు సుడానీస్ మిలటరీ అధిపతి జనరల్ అబ్దెల్ ఫత్తా బుర్హాన్ కాగా మరొకరు ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌కు అధిపతిగా ఉన్న మహ్మద్ హమ్దాన్ దగాల. ఈ ఆధిపత్య పోరు ఏప్రిల్ 2023లో పెద్ద ఎత్తున సంఘర్షణగా మారి సూడాన్ పౌరులు తీవ్ర కరువు కోరల్లో చిక్కడానికి కారణమయింది. క్రూరమైన సంఘర్షణ కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోయేలా చేసింది. జూన్ 2024 నాటికి స్థానభ్రంశం చెందిన వారి సంఖ్య దాదాపు 1.2 కోట్లకు చేరుకుంది. ఈ సంఘర్షణ ఈ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసింది. దాదాపు వీరి సంఖ్య సూడాన్ జనాభాలో (2.50 కోట్ల ) సగానికి పైగా అవసరంలో ఉన్నారు. ఈ సంఘర్షణలో కనీసం 15,500 మంది మరణించారని అంతర్జాతీయ నివేదికలు తెలుపుతున్నాయి. గత ఇరవై నెలల నుండి జరుగుతున్న విధ్వంసకర సంఘర్షణ, పెరుగుతున్న ప్రజల స్థానభ్రంశం, నిధులలో అంతరాయంతో పాటు మానవతా సహాయం అందుబాటుపై వీరి తీవ్రమైన ఆంక్షలు మూలంగా సూడాన్‌లోని పంట ఉత్పత్తి ప్రాంతాలైన డార్ఫర్, కోర్డోఫాన్, ఖార్టూమ్, అల్జజీరా ప్రాంతాలలో అత్యంత ఘోరమైన కరువు తాండవిస్తుంది. వ్యాపార మార్కెట్లు, మానవతా సహాయ గిడ్డంగులను దోపిడీ చేయడం ఆహార కొరతకు మరింత దోహదం చేసింది. సంఘర్షణ మూలంగా సూడాన్లో ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. ఊహా తీతమైన నిష్పత్తిలో ఆకలి సంక్షోభం ఉంది. సూడాన్ తీవ్ర స్థాయిలో ఆహార అభద్రతను ఎదుర్కొంటోంది. ప్రతిరోజూ లక్షలాది ప్రజలు తమ కుటుంబాలను పోషించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది ప్రజలకు తగినంత ఆహారం అందుబాటులో లేదు. వ్యవసాయోత్పత్తిపై ప్రభావం చూపుతోంది. వేలాది మంది రైతులు మరణిస్తున్నారు. ఆహార వ్యవస్థలు దిగజారాయి.ఆహార మార్కెట్లు ఖాళీగా ఉంటున్నాయి. అధిక ఆహార ధరలు, తక్కువ కొనుగోలు శక్తి మానవతా అవసరాలను పెంచుతున్నాయి. పంటలు పండించగల ప్రజల సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఇంధన ధర పెరుగుతోంది. దక్షిణ సూడాన్‌లో అవసరాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజల ఆదాయాలపై ప్రభావం చూపింది. సుడాన్ "బ్రెడ్‌బాస్కెట్", అల్ జాజిరా రాష్ట్రానికి సంఘర్షణ విస్తరించడం వలన ఐదు లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు.

**సంక్షోభంలో సూడాన్ అగ్రస్థానం:**

ప్రతి సంవత్సరం ప్రపంచ మానవతా సంక్షోభాల అవకాశాల్ని విశ్లేషించే అంతర్జాతీయ రెస్క్యూ కమిటీ " "ఎమర్జెన్సీ వాచ్ లిస్టు"లో సూడాన్ మొదటి స్థానంలో ఉంది. సూడాన్లో పెరుగుతున్న సంఘర్షణ, సామూహిక స్థానభ్రంశం, ఆర్థిక సంక్షోభం, ఆరోగ్య సంరక్షణ సేవల పతనం కారణంగా సూడాన్ అగ్రస్థానంలో నిలవడానికి కారణాలుగా ఉన్నాయి.

**ప్రస్తుత పరిస్థితి:**

ఈ సంఘర్షణసూడాన్ జనాభాలో దాదాపు పావు వంతు అంటే సుమారు 1.2 కోట్లకు పైగా ప్రజలను వారి ఇళ్ల నుండి తరిమివేసింది. సూడాన్ సంఘర్షణకు ముందే దీర్ఘకాలిక రాజకీయ అస్థిరత, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా 1.58 కోట్ల మందికి మానవతా సహాయం అవసరమైంది. విపరీతమైన వాతావరణ షాక్‌లు, సామాజిక, రాజకీయ అశాంతి, పేదరికం, ఆకలి, పెరుగుతున్న ఆహార ధరల కారణంగా సుడాన్ ఇప్పటికే మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ఇది ఆహార అభద్రతను మరింత తీవ్రతరం చేసింది. అంతర్జాతీయ మానవతా చట్టాలను కూడా దేశ నలుమూలల విస్మరిస్తూ జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భీకర పోరు కొనసాగిస్తున్నారు. పౌరులు అధిక సంఖ్యలో మరణించారు. అనేక మంది గాయపడ్డారు. లైంగిక హింస విపరీతంగా ఉంది. ఆరోగ్య సంరక్షణ, విద్యా సౌకర్యాలతో సహా అవసరమైన మౌలిక సదుపాయాలు శిథిలావస్థలో ఉన్నాయి. పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం సహా అత్యవసర సేవలు నిలిచిపోయిన నేపథ్యంలో కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

**ఆందోళన వ్యక్తం చేసిన యుఎన్:**

శరవేగంగా దిగజారుతున్న పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ " యుయన్ దాని భాగస్వాములు ఆహార సహాయం, ఇతర అవసరమైన మద్దతు కార్యక్రమాలను పెంచుతున్నారని" పేర్కొన్నారు. "కొనసాగుతున్న పోరాటం, సహాయక సామాగ్రి, సిబ్బంది కదలికలపై ఆంక్షలు కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని" ఆయన ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "మానవతా సహాయం, సిబ్బంది అవసరమైన చోటకు చేరుకోవడానికి వేగవంతమైన, సురక్షితమైన, ఆటంకం లేని స్థిరమైన ప్రాప్యతను సులభతరం చేయాలని సెక్రటరీ జనరల్ పార్టీలకు తన పిలుపును పునరుద్ఘాటించారు"

**తక్షణమే యుద్ధ విరమణ అవసరం:**

2025లో సూడాన్ సంక్షోభం, పొరుగు దేశాలపై దాని ప్రభావం మరింత పెరగకుండా నిరోధించడానికి, ప్రాణాలను కాపాడటానికి శత్రుత్వాన్ని తక్షణమే నిలిపివేయాల్సిన అవసరాన్ని గుటెరస్ నొక్కి చెప్పారు. శాశ్వత కాల్పుల విరమణ ద్వారా వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించడానికి పార్టీలను దగ్గర చేయడానికి, మానవతా చర్యలకు నిధులను పెంచడానికి తక్షణ అంతర్జాతీయ మద్దతు, సహకారాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే యుద్ధ విరమణ చేస్తేనే సంక్షోభం తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చని ఐపీసీ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా సంఘర్షణ ప్రాంతాలలో సురక్షితమైన, అంతరాయం లేని స్థిరమైన మానవతా ప్రాప్యతను పునరుద్ధరించాలని, బహుళ రంగాల మానవతా సహాయాన్ని గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చింది. అలాగే, తీవ్రమైన పోషకాహార లోపానికి చికిత్సను పెంచాలని, బలహీనమైన కుటుంబాలు తమను తాము నిలబెట్టుకోవడంలో సహాయపడటానికి ముఖ్యమైన వ్యవసాయ సహాయాన్ని అందించాలని, అలాగే ప్రతిస్పందన ప్రయత్నాలను మెరుగుపరచడానికి విశ్లేషించని ప్రాంతాల్లో ఆహార భద్రత, పోషకాహార సర్వేలను నిర్వహించాలని పిలుపునిచ్చింది.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

## ఆకలి.. అవమానం!


ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం స్థానం కాస్తంత మెరుగుపడినందుకు సంతోషించాలో, పరిమాణంలోనూ, ఆర్థికంగానూ చిన్నవైన పొరుగుదేశాలతో పోల్చితే బాగా వెనుకబడి ఉన్నందుకు బాధపడాలో తెలియడం లేదు. శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌లు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగ్గా ఉన్నాయి. 127దేశాల జాబితాలో భారత్ ప్రస్తుతం 105వ స్థానంలో ఉంది. గత ఏడాది 125దేశాల్లో 111వస్థానంలో, అంతకుముందు 107లోనూ ఉన్నందున ప్రస్తుతానికి స్థానం కాస్తంత మెరుగుపడినట్టే. కానీ, తీవ్రమైన ఆకలిబాధ చవిచూస్తున్న దేశంగా ముద్ర పడటం అవమానకరం. పదేళ్ళలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిందనీ, జీడీపీ హెచ్చిందనీ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ పరుగుపందెంలో ముందంజలో ఉన్నదని ప్రచారం చేసుకుంటున్న మన పాలకులను ఇటువంటి నివేదికలు కచ్చితంగా కలవరపెడతాయి. వాటిని విదేశీకుట్రగా ముద్రవేయడం, తప్పులతడక అంటూ తీసిపారేయడం వారికి ఎంతో సులువు.

ఆకలిబాధ ఆందోళనకర స్థాయిలో ఉన్న దేశాల్లో మనది కూడా ఒకటి. మరోలా చెప్పుకోవాలంటే, ఆ లెక్కన పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచింది. పోషకాహారలోపం, శిశుమరణాలు ఇత్యాది ప్రాతిపదికలమీద ఆకలిబాధను లెక్కగట్టే ఈ నివేదిక భారత్‌లో ఉన్న తీవ్రమైన పరిస్థితులను లోతుగా ప్రస్తావించింది. దాదాపు 14శాతం మంది పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు, ఐదేళ్ళలోపు పిల్లల్లో మూడో వంతుకంటే ఎక్కువమంది వయసుకు తగ్గ ఎత్తు ఎదగలేదు, సుమారు 19శాతం మంది ఎత్తుకు తగ్గబరువు లేరు. ఐదేళ్ళు నిండకుండానే కన్నుమూస్తున్న పిల్లల మూడుశాతం వరకూ ఉన్నారు. నాలుగు కీలకమైన అంశాలను తీసుకొని, పోషకాహారలోపం, శిశుమరణాలకు మూడోవంతు విలువ, మిగతా రెండింటికీ ఆరోవంతు విలువ ఇస్తూ మొత్తం స్కోరు లెక్కగట్టే ప్రక్రియలో భారత్ 27.3 పాయింట్లు దక్కించుకుంది. పోషకాహారం మాట పక్కనబెడితే, ఆహారం అందుబాటులో ఉండటమన్నది కూడా ఒక సమస్య అని ఈ నివేదిక తెలియచెబుతోంది. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అప్పులకోసం వెంపర్లాడుతున్న శ్రీలంక, రాజకీయ సంక్షోభంలో మునిగిన బంగ్లాదేశ్, నలుదిక్కులా పోరాటాలతో, అంతర్యుద్ధంతో తీసుకుంటున్న మయన్మార్ వంటి దేశాలు మనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఎలా నిలవగలిగాయన్నది అసలు ప్రశ్న. పౌష్టికాహారలోపం ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య ప్రపంచస్థాయిలో కూడా పెరుగుతున్నదని, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, వలసలు, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ ఆకలిసూచీ స్కోరును పెంచేస్తున్నాయని ఈ నివేదిక అంటోంది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను భారతదేశ పాలకులు ఒప్పుకోకపోవడం కొత్తేమీ కాదు. లోపభూయిష్టమైన పద్ధతుల్లో, విధానాల్లో ఈ లెక్కలు కడుతున్నారని, కొద్దిమందిని నమూనాగా తీసుకొని, ఆకలిని దేశవ్యాప్తంగా వర్తింపచేస్తున్నారని మన ప్రభుత్వం వాదన. ఈ నివేదికలో దేశాలన్నింటికీ వర్తించిన కొలమానాలే తప్ప మనకు వేరు లెక్కలంటూ ఏమీ ఉండవు. పైగా, నివేదిక తయారీలో వాడిన వివరాలు, గణాంకాలన్నీ ప్రపంచ ఆరోగ్యసంస్థ, యునిసెఫ్ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల నుంచి సేకరించినవో, అవి ప్రచురించిన నివేదికలనుంచి తీసుకున్నవో అవుతాయి. గత నివేదికలను ప్రభుత్వం తిరస్కరించినప్పుడు కూడా భారత ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల వంటివి ఈ చేదునిజాలను ముందే చెప్పిన విషయాన్ని విపక్షాలు, మీడియా గుర్తుచేశాయి కూడా. గత కొన్ని దశాబ్దాలుగా భారత్ స్కోరు మెరుగుపడినప్పటికీ, దేశంలో ఇంకా ఆకలికేకలు తగ్గలేదని ఈ సూచీ చెబుతున్నది. అంతర్జాతీయ సమాజం ముందు తలవంపులు తెచ్చే ఇటువంటి నివేదికలను తిరస్కరించడానికే పాలకులు ఉత్సాహపడటం సహజం. ఒప్పుకోనంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగే సర్వేలు, వివిధ ప్రభుత్వశాఖలు సేకరించే గణాంకాలమీద ఇటీవలి కాలంలో పాలకులకు అయిష్టత పెరుగుతూ, వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమో, వాయిదావేయడమో, సర్వేలు చేపట్టినా వివరాలు బహిర్గతపరచకపోవడమో జరుగుతోంది. కానీ, ప్రజలకు ఆహారాన్ని అందించే విషయంలో ఎంతో శ్రద్ధపెడుతున్నామంటున్నవారు, ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ తెలుసుకోక తప్పదు. జాతీయ ఆహారభద్రతాచట్టం, ప్రధానమంత్రి అన్న యోజన, మాతృవందన, పోషణ్ వంటి అనేకానేక పథకాలతో ఆకలిని ఉపశమింపచేసి, పలు కార్యక్రమాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామన్న ప్రభుత్వం వాదనను ఆకలిసూచీలో మన స్థానం సవాలు చేస్తున్నమాట నిజం.

# సిద్ధి పొందాలంటే...

భక్తి



సిద్ధ సంప్రదాయం గురించి తెలుసుకోవాలంటే 'సిద్ధి' అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. అందుకోసం సాధన చేయాలి. గురువు నుంచి ఉపదేశ దీక్ష, మార్గదర్శకత్వం పొంది, యోగ మార్గంలో తీవ్ర సాధన చేసి... సాధకుడు తనలోని అరిషడ్వర్గాలను జయించాలి. ఆత్మ సాక్షాత్కారం పొందాలి. అదే 'సిద్ధ స్థితి' లేదా 'సిద్ధ అవస్థ',

యోగికి ఆత్మసాక్షాత్కారం కలిగినప్పుడు... పూర్వకర్మలు, వాటి ప్రతిఫలాలు, అహం, ఆత్మ, జ్ఞానం, మాయ, సర్వేంద్రియాలు, ఇంద్రియ శక్తులు, మనస్సు తదితరాలన్నీ అతనిలోనే అంతర్గతంగా ఉన్న బ్రహ్మతత్త్వంలో లీనమవుతాయి. ఆ విధంగా సిద్ధావస్థకు చేరుకున్న యోగి బాహ్య స్పృహ కోల్పోతాడు. పరమాత్మలో లీనమవుతాడు.

నిర్మల, నిర్గుణ, నిరామయ, నిత్య వర్తమాన స్థితిలో ప్రకాశిస్తూ ఉంటాడు.


సృష్టిలోని జీవ పరిణామ క్రమంలో 84 లక్షల జీవరాశుల మీదుగా (తరు, శిల జన్మలు మొదలుకొని గోవు, మానవ జన్మల వరకూ) సాగే ప్రయాణంలో సర్వోన్నతమైన మానవ జన్మ నుంచి ఆత్మ సాక్షాత్కారం ద్వారా పరమేశ్వరునిలో లీనం కావడం అనేది సృష్టి తాలూకు నియమిత గమ్యం. సిద్ధపరంపరకు ఆది పురుషుడు పరమశివుడు.

ఆ తరువాత కార్తికేయుడు, అగస్త్యముని మొదలుగా సిద్ధ సంప్రదాయంలో లోక కల్యాణార్థం ఎందరో మహాత్ములు తేజోమయ స్థితిలో విరాజిల్లుతున్నారు. దత్త తత్త్వంలో శివతత్త్వం అంతర్భాగం కాబట్టి ఆదిగురువైన పరంజ్యోతి దత్తప్రభువు... సిద్ధ సంప్రదాయానికి పరమావధి. %సిద్ధ స్థితిలో ఉన్న వ్యక్తిలో స్వతఃసంకల్పం, వ్యక్తిత్వం అనేవి శూన్యమవుతాయి. అతడు జీవన్ముక్తావస్థలో నిలిచి ఉంటాడు. పరమేశ్వరుడి సంకల్పం, దివ్య లీల లోక కల్యాణార్థం ఆ సిద్ధుని ద్వారా ప్రకటితమవుతాయి. యోగమార్గంలో తపిస్తున్న యోగ్యులైన సాధకులకు పరమేశ్వర సంకల్పానుసారం సిద్ధ యోగులు భావతరంగాల మాధ్యమంలో సంకేత, సంబోధనలద్వారా... కొన్ని సమయాల్లో స్వప్న సాక్షాత్కారం, సూక్ష్మ శరీర మాధ్యమం ద్వారా ప్రత్యక్ష, పరోక్ష మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తూ ఉంటారు. దత్త ప్రభువుల లీలా విలాసంలో భాగంగా... 60 వేలమంది సిద్ధ యోగులు నిరంతరం ఈ విశాల విశ్వంలో కొలువై ఉంటారు.

వారిద్వారా దత్తప్రభువు ఈ సృష్టిని పరిపాలిస్తూ ఉంటాడు. సమున్నత హిమాలయ ప్రాంతాల్లో... మామూలు కళ్ళకు కనిపించని నిగూఢమైన, అవాగ్మానస గోచరమైన దివ్య సిద్ధ ఆశ్రమాలలో వందలాది, వేలాది సంవత్సరాలకు పైబడిన సిద్ధులు ఎందరో నివసిస్తున్నారు. వారి సంకల్పం, అనుగ్రహం ఉన్న సాధకులకు, జిజ్ఞాసులకు, అన్వేషకులకు సిద్ధాశ్రమ దర్శనానికి, ప్రవేశానికి అవకాశం కలుగుతుంది. తద్వారా ఆధ్యాత్మిక పరిణతి, పురోగతి సాధ్యమవుతుంది.వివిధ కాలమాన పరిస్థితులలో మానవాళికి సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు... దత్త సంకల్పం ద్వారా కొంతమంది సిద్ధ పురుషులు మానవ జన్మ (కారణ జన్మ) ద్వారా... మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేస్తారు. యోగమార్గాన్ని సరళం చేసి... కొన్ని తరాలవారికి జీవన అభ్యున్నతిని, ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదిస్తారు. అనంతరం తమ కారణ జన్మలను చాలించి సిద్ధాశ్రమానికి మరలి వెళ్తారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, యోగానంద లాంటి సిద్ధ పురుషులు ఇందుకు ఉదాహరణలు.



## నల్లని శిరోజాలకు జోజోబా నూనె



శిరోజాల సమస్యలను నివారించడంలో జోజోబా నూనె అద్భుతంగా పనిచేస్తుంది. ఈ నూనెలో బి, ఇ విటమిన్లుబీ జింక్, కాపర్ మినరల్స్‌బీ ఫాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. మాడు మీద ఈ నూనెతో మెల్లగా మర్దన చేస్తే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. తలమీద ఉన్న చర్మానికి రక్తప్రసరణ జరిగి శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. మాడు మీద సెబమ్ ఉత్పత్తి నియంత్రణలో ఉండి వెంట్రుకలు జిడ్డుగా మారవు. జోజోబా నూనె అందించే మరికొన్ని ప్రయోజనాలు...

ఇ-విటమిన్‌తో: ఇ విటమిన్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శిరోజాలు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తాయి. రెండు ఇ విటమిన్ ట్యాబ్లెట్స్ నుంచి నూనెను తీసి ఒక చిన్న గిన్నెలో వేయాలి. దీనికి రెండు చెంచాల జోజోబా నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని అరచేతుల్లోకి తీసుకుని మాడు మీద గుండ్రంగా రాస్తూ మర్దన చేయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లు, గాఢత లేని షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే వెంట్రుకలు రాలడం తగ్గుతుంది.

తేనెతో: తేనెలో అధికంగా తేమతోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మాడుమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా నూనె, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలంతా పట్టించాలి. తరవాత షవర్ క్యాప్‌తో మూసివేయాలి. నలభై నిమిషాల తరవాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చుండ్రు సమస్యలు రాకుండా ఉంటాయి. శిరోజాలు పొడవుగా పెరుగుతాయి.

# బెండకాయలతో బ్రహ్మాండంగా!

**బెండకాయలతో తయారుచేసిన రకరకాల కూరలు, వేపుళ్లు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వారానికి రెండుసార్లు బెండకాయలను ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె జబ్బులు రావు. రక్తం శుద్ధి అవుతుంది. బెండకాయల్లో ఫోలిక్ ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. కాబట్టి బెండకాయ కూరలను పెరిగే పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా తినాలి. లేత బెండకాయలతో చేసే ప్రత్యేక వంటకాల వివరాలు మీ కోసం.......బెండకాయ మసాలాబెండకాయ వేపుడు**

**బెండకాయ మసాలా వేపుడు**

అరకేజీ బెండకాయలను శుభ్రంగా కడిగి తేమ లేకుండా తుడవాలి. తరవాత చిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల వేరుశనగ గుండ్లు, రెండు చెంచాల తెల్ల నువ్వులు, అరచెంచా జీలకర్ర, రెండు చెంచాల ఎండు కొబ్బరి పొడి, నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి ఎర్రగా వేపాలి. వీటిని చల్లార్చి మెత్తని పొడిలా చేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. అందులో రెండు కరివేపాకు రెమ్మలు తుంచి వేయాలి. తరవాత బెండకాయ ముక్కలు వేసి గిన్నెను కదిలిస్తూ వాటిని దోరగా వేపాలి. ముక్కలు వేగాక వాటిపై ఒక చెంచా ఉప్పు, ముప్పావు చెంచా కారం, ముందుగా తయారు చేసుకున్న మసాల పొడి, చిటికెడు పసుపు వేసి గిన్నెను పైకి కింది ఊపుతూ నాలుగు నిమిషాలు కలపాలి. గరిటెతో కలపకూడదు. కావాలనుకుంటే గరం మసాలా పొడి కూడా చల్లుకోవచ్చు. కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ వేపుడు వేడి అన్నంలోకి బాగుంటుంది. పిల్లలు బాగా ఇష్టపడతారు.

**బెండకాయ పకోడీ**

పావు కేజీ బెండకాయలను నిలువుగా చీలికల మాదిరి కోయాలి. ఒక గిన్నెలో అర చెంచా గరం మసాలా, ఒక చెంచా కార్న్‌ఫ్లోర్, అయిదు చెంచాల బియ్యం పిండి, ఒక చెంచా ధనియాల పొడి, రెండు చెంచాల కారం, ఒక చెంచా ఉప్పు, అరగ్లాసు నీళ్లు పోసి బజ్జీల పిండిలా కలపాలి. ఇందులో బెండకాయ చీలికలు వేసి పావు గంట నాననివ్వాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా వేడెక్కాక అందులో బెండకాయ చీలికలను ఒక్కోటి వేయాలి. ఎర్రగా వేగిన తరవాత టిష్యూ పేపర్‌లోకి తీయాలి. ఈ బెండకాయ పకోడీని చిరుతిండిగా పిల్లలకు పెట్టవచ్చు. టీ సమయంలో పెద్దవాళ్లు తినడానికి కూడా బాగుంటుంది.

**టమాటా-భిండీ మసాలా**

పావుకేజీ బెండకాయలకు మధ్యలో పొడవుగా గాటు పెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడయ్యాక పావు చెంచా జీలకర్ర, పావు చెంచా ఆవాలు వేయాలి. ఒక పెద్ద సైజు ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. అది కొద్దిగా వేగాక బెండకాయలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, చిటికెడు పసుపు వేసి కలపాలి. టమాటా ముక్కలు మెత్తగా అయిన తరవాత రెండు చెంచాల కారం, ఒక చెంచా ధనియాల పొడి. అర చెంచా గరం మసాలా పొడి, అరచెంచా ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి రెండు చెంచాల నిమ్మరసం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి మెల్లగా కలపాలి. ఈ మసాలా కూర పుల్కాలు, చపాతీల్లోకి బాగుంటుంది.

**భిండీ-వెల్లుల్లి వేపుడు**

బెండకాయలను మధ్యలో చీల్చి ఉంచుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నూనె వేసి వేడిచేయాలి. అందులో పచ్చిమిర్చి చీలికలు, పొడవుగా కోసిన వెల్లుల్లి రెబ్బలు, చిటికెడు పసుపు, రెండు కరివేపాకు రెమ్మలు వేసి దోరగా వేపాలి. తరవాత బెండకాయలు వేసి కలపాలి. బెండకాయలు బాగా వేగాక రుచికి తగినంత ఉప్పు, కొంచెం మిరియాల పొడి వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి ఒక చెంచా నిమ్మరసం వేసి కలపాలి. ఈ వేపుడు కూడా వేడి అన్నంలోకి బాగుంటుంది.





## జిడ్డుగారే తలకు నిమ్మ



నాలుగు చినుకులు పడితే చాలు జుట్టు జిడ్డుగారుతూ కనిపిస్తుంది. అలాగే చివర్లు చివర్లు చిట్లడం, జుట్టురాలడం వంటి సమస్యలూ ఈ కాలంలో మామూలే. వీటిని అధిగమించాలంటే... ఇంట్లోనే అప్పుడప్పుడూ ఈ పూతలు ప్రయత్నించి చూడండి.

- ఆలివ్‌నూనె, తేనెను 2:1 నిష్పత్తిలో తీసుకోవాలి. ఈ రెండింటినీ కలిపి కాస్త గోరువెచ్చగా చేసి తరువాత మాడుకు కాకుండా మిగిలిన జుట్టుకు పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో కడిగేయాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.

-చివర్లు చిట్లిన సమస్య చాలామందిలో కనిపిస్తుంది. దీన్ని నివారించాలంటే అరకప్పు పెరుగులో పావుకప్పు బొప్పాయి గుజ్జు కలిపి తలంతా పూతలా పట్టించాలి. అరగంటాగి గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. అదేవిధంగా కలబంద గుజ్జులో పెద్ద చెంచాడు నిమ్మరసం, రెండు పెద్ద చెంచాల ఆముదం కలిపి తలంతా రాసి బాగా మర్దనా చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చివర్లు చిట్లడటం తగ్గుతుంది.

- తలస్నానం చేసినా జుట్టు జిడ్డుగా కనిపిస్తోందా. రెండు గుడ్ల పచ్చసొనలో కొద్దిగా నిమ్మరసం, తేనె వేసి బాగా కలపాలి. దీన్ని తలకు రాయాలి. బాగా ఆరాక తలస్నానం చేయాలి. జిడ్డు వదలడమే కాదు, మెరుస్తుంది కూడా.

## ఇండో-చైనీస్ డ్రై చిల్లీ చికెన్




**కావలసినవి:**బోన్‌లెస్ చికెన్: అరకిలో, ఉల్లిపాయ: ఒకటి, ఆకుపచ్చ క్యాప్సికమ్: ఒకటి(చిన్నది), సోయాసాస్: టేబుల్‌స్పూను, వైట్ వినెగర్: పావుటీస్పూను, గ్రీన్ చిల్లీ సాస్: టేబుల్‌స్పూను, మిరియాలపొడి: టీస్పూను, పచ్చిమిర్చి: మూడు, కాశ్మీరీ కారప్పొడి: 3 టీస్పూన్లు, వెల్లుల్లి ముద్ద: టేబుల్‌స్పూను, కార్న్‌ఫ్లోర్: టేబుల్‌స్పూను, మైదాపిండి: టేబుల్‌స్పూను, గుడ్డు: ఒకటి, ఉప్పు: రుచికి సరిపడా, నూనె: తగినంత, ఉల్లికాడలు: కొద్దిగా

తయారుచేసే విధానం ..-చికెన్ ముక్కల్లో అర టేబుల్‌స్పూను సోయాసాస్, గుడ్డుసొన, ఉప్పు, మిరియాలపొడి, మైదాపిండి, సగం వెల్లుల్లి ముద్ద, సగం చిల్లీ సాస్ వేసి కలిపి ఓ అరగంటసేపు నాననివ్వాలి.

- ఓ పాన్‌లో తగినంత నూనె పోసి చికెన్ ముక్కలు వేసి బంగారు వర్ణంలోకి మారేవరకూ వేయించి తీసి పక్కన ఉంచాలి.
- అదే పాన్‌లో మరికాస్త నూనె వేసి మిగిలిన వెల్లుల్లి ముద్ద, కాశ్మీరీ కారం వేసి రెండు నిమిషాలు వేయించాలి. తరవాత ఉల్లి, క్యాప్సికమ్ ముక్కలు వేసి బాగా వేగాక వినెగర్ వేసి కలపాలి. తరవాత వేయించిన చికెన్ ముక్కలు వేసి మిగిలిన సోయాసాస్, గ్రీన్ చిల్లీ సాస్, ఉప్పు, పంచదార, మిరియాలపొడి వేసి కలిపి నాలుగైదు నిమిషాలు వేయించాలి. చివరగా ఉల్లికాడల ముక్కలు చల్లి దించి వేడివేడిగా వడ్డించాలి.

## మెడలో మందిరం





దేవుడికి మెడలోనూ గుడి కడుతున్నారు డిజైనర్లు. 'టెంపుల్ లాకెట్లు' నగల డిజైన్లలో కొత్త ట్రెండ్ ఇప్పుడు. దేవుడి ప్రతిమ ఏదైనా.. దాని చుట్టూ ముచ్చటైన మందిరాన్ని పోలిన నిర్మాణం ఉండటం వీటి ప్రత్యేకత. శిల్ప కళకు దీటుగా నగిషీలు చెక్కుతున్నారు. అందమైన స్తంభాలు, ముచ్చటైన గోపురాలను ఆభరణాల్లో ఆవిష్కరిస్తున్నారు. లక్ష్మి, గణపతి, కృష్ణుడు, శివుడు, వేంకటేశ్వరుడు.. ఇలా రకరకాల దేవతా ప్రతిమలు ఉంటున్నాయి ఇందులో. ముఖ్యంగా లక్ష్మీదేవికి సంబంధించి బోలెడు డిజైన్లు వస్తున్నాయి. మందిరం ఆకృతుల్లో అయితే లెక్కకు మిక్కిలి వెరైటీలు దొరుకుతున్నాయి. యాంటిక్ ఫినిష్‌తో చోకర్లు, హారాలు, నెక్లెస్‌లు.. ఇలా అన్నిటిలోనూ వస్తున్నాయి. పచ్చలు, కెంపులు, వజ్రాలు, ముత్యాలు పొదిగినవే కాదు.. నగకు ప్రత్యేక లుక్ తీసుకు వచ్చేలా బీడ్స్ తరహాలోనూ టెంపుల్ లాకెట్లు రూపొందుతున్నాయి. కొన్ని మందిరాలు త్రీడీ తరహాలో ఉంటే, కొన్ని అచ్చమైన మండపంలా చదరంగా ఉంటున్నాయి.

















## రక్తంలో చక్కెర పెరుగుదలకు కారణమయ్యే 10 ఆహారాలు ఇవే..




ఆరోగ్యకరమైన బ్లడ్ షుగర్ స్థాయిల కోసం కొన్ని ఇష్టమైనవి వదులుకోక తప్పదు. మధుమేహం ఉన్నవారు ఇష్టమైన ఆహారాన్ని వదులుకోకుండా సమతుల్య ఆహారం తీసుకోవచ్చు. ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మితంగా తీసుకోవాలి. ఒక వ్యక్తి కార్బోహైడ్రేట్లను తిన్నప్పుడు శరీరం ఇన్సులిన్ అనే హార్మోన్లు విడుదల చేయదు. దీని వలన రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. కొన్నిరకాల ఫుడ్స్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరుగుతాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఆహారంలో కార్బోహైడ్రేట్లను లెక్కించడం ముఖ్యం. ఇది కార్బోహైడ్రేట్ల శాతం గురించి మాత్రమే కాదు. ఆహారంలో ఫైబర్, ప్రోటీన్లు, కొవ్వులు రక్తంలో చక్కెరను కూడా ప్రభావితం చేస్తాయి.

ఆహారంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెరుగుతుందో కొలవడాన్ని గ్లైసెమిక్ ఇండెక్స్‌గా సూచిస్తారు. మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరుగడం వల్ల తలనొప్పి, దాహం పెరగడం, తరచుగా మూత్రవిసర్జన, అలసట, నోరు పొడిబారడం వంటి సమస్యలు కనిపిస్తాయి.

భారతీయ వంటకాల్లో ప్రధానంగా చెప్పుకునే బియ్యం.. అన్నం కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

రక్తంలో చక్కెర పరుగుదల విషయంలో కార్బోహైడ్రేట్లు, సంతృప్త కొవ్వులు అధికంగా ఉండే ఆహారాలు ప్రధానంగా కారణంగా మారవచ్చు.

వీటిలో ముఖ్యంగా పాస్తాలు, పకోడాలు, డ్రింక్స్ వంటివి ఉన్నాయి. డైట్ సోడాల్లో ఉండే జీరో క్యాలరీలలో కృత్రిమ స్వీటెనర్లున్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెరిగేలా చేస్తాయి.

వోట్మీల్ బరువు తగ్గడానికి మంచి ఎంపిక. ఇందులో ఫైబర్ తీసివేయడం కారణంగా రక్తంలో చక్కెర పెరుగుదలకు దారి తీస్తుంది.

నిద్రలేవగానే ఈ సంకేతాలు హై బీపీ లక్షణాలు కావచ్చు.. ఇలాంటి లక్షణాలను చెక్ చేసుకోండి..!

కమలా రసంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది గ్లూకోజ్ గా విభజించడాన్ని నెమ్మదించేలా చేస్తుంది. రసం తీయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

బ్రెడ్‌ను తృణధాన్యాలతో తయారు చేయడం వల్ల ఇందులో గ్లైసెమ్క్ ఇండెక్స్ ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెరిగేలా చేస్తాయి.

రెస్టారంట్ సూప్స్ లలో ఎక్కువ చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర పెరిగేలా చేస్తుంది.

బంగాళాదుంప, మొక్కజొన్న, బఠానీ వంటి పిండి కూరగాయలలో రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

సాఫ్ట్ ఫీజీ డ్రింక్స్, క్యాన్డ్ ఫ్రూట్ జ్యూస్‌లు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

ద్రాక్షపండ్లు కూడా చక్కెర ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర పెరుగుదలకు కారణమవుతుంది.




## ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్




**ముంబై-నవభూమి:** గతవారం భారీ నష్టాలకు సోమవారం బ్రేకులు వేసి లాభాల బాట పట్టిన దేశీయ సూచీలు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. లాభనష్టాలతో దోబూచులాడాయి. ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు రాణించినప్పటికీ, మెటల్ స్టాక్స్ నష్టాల్లో ఉండడంతో సెన్సెక్స్ ఒడిదుడుకులు ఎదుర్కొంది. చివరకు ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలను ఆర్జించింది. సోమవారం ముగింపు (78, 540)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకుంది. 150 పాయింట్లకు పైగా నష్టపోయి 78, 397 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చి ఒక దశలో 300 పాయింట్లకు పైగా లాభపడి 78, 877 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలవడంతో కాస్త ఒడిదుడుకులకు లోనైంది. చివరకు 67 పాయింట్ల స్వల్ప నష్టంతో 78, 472 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 15 పాయింట్ల లాభంతో రోజును ప్రారంభించింది. చివరకు 25 పాయింట్ల నష్టంతో 23, 727 వద్ద రోజును ముగించింది. సెన్సెక్స్‌లో ఆర్బీఎల్ బ్యాంక్, బయోకాన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, హిందుస్తాన్ కాపర్, టాటా కెమికల్స్ షేర్లు లాభాలు అందుకున్నాయి. పీబీ ఫిన్‌టెక్, మాక్రోటెక్ డెవలపర్స్, సైమన్స్, దాల్మియా భారత్ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి.

## ఐసీయూలో రూపీ..! ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరిక



**ముంబై-నవభూమి:** డాలర్ దెబ్బకు రూపాయి ఏమాత్రం నిలబడలేక పోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా కరెన్సీతో పోల్చితే భారతీయ కరెన్సీ మారకం విలువ మళ్లీ ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది మరి. మంగళవారం మరో 4 పైసలు పడిపోవడంతో మునుపెన్నడూ లేనివిధంగా 85.15 వద్దకు చేరింది. దీంతో ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో గత 4 రోజులుగా రూపీ 85పైనే ఉంటున్నట్టైంది. గత గురువారం తొలిసారి 85 మార్కును దాటిన విషయం తెలిసిందే. సోమవారం కూడా 7 పైసలు నష్టపోగా.. ఈ రెండు రోజుల్లో 11 పైసలు కోల్పోయింది.

**పతనం వెనుక..**

డిసెంబర్ నెల ముగుస్తుండటంతో దేశీయ మార్కెట్‌లోని దిగుమతిదారులపై చెల్లింపుల ఒత్తిడి ఉంటుందని, ఈ క్రమంలోనే డాలర్లకు పెరుగుతున్న డిమాండ్.. రూపీని మరింత బలహీనపరుస్తున్నదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. పైగా జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతున్నారు. దీంతో మళ్లీ సుంకాల సమరం మొదలవుతుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఫలితంగా డాలర్ల కోసం భారతీయ దిగుమతిదారులు ఎగబడిపోతున్నారు. కాగా, ఫెడ్ రిజర్వ్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా వెళ్తుండటం కూడా రూపీ కష్టాల్ని పెంచిందన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఇక దేశీయ మార్కెట్ల నుంచి ఆగని విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణలు సైతం పరిస్థితుల్ని ఇంకా దిగజార్చుతున్నాయి. మొత్తానికి రూపాయి పతనం.. దేశీయ దిగుమతుల్ని ఖరీదెక్కిస్తుండగా, ద్రవ్యోల్బణం, ద్రవ్య పరపతి, చివరకు దేశ ఆర్థిక వ్యవస్థల్నే ప్రమాదంలోకి నెడుతున్నది.

**నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు**

క్రిస్‌మస్ సందర్భంగా బుధవారం స్టాక్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లకు సెలవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ 4 రోజులకు పరిమితమైంది. ఇదిలా ఉంటే మంగళవారం సెన్సెక్స్ 67, నిఫ్టీ 26 పాయింట్లు క్షీణించాయి.

## పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల ట్రెండ్.. 33శాతం పెరిగిన యూపీఐ క్యూఆర్ లావాదేవీలు..!




**హైదరాబాద్-నవభూమి:** ఈ ఏడాది సెమీ అర్బన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రిటైల్ షాపుల్లో యూపీఐ క్యూఆర్ లావాదేవీలు 33శాతం పెరిగాయి. దేశంలో డిజిటల్ చెల్లింపుల ట్రెండ్ పెరుగుతుందనడానికి ఇదే నిదర్శనమని పేనియర్‌బై విడుదల చేసిన నివేదిక చెబుతున్నది. వ్యాపార రుణాలు, వ్యక్తిగత బంగారం రుణాలు, ఈ ప్రాంతాల్లో సులభ నిబంధనలపై రివాల్వింగ్ ఇచ్చిన రుణాలతో సహా రుణ ఉత్పత్తుల్లో 297శాతం పెరుగుదల నమోదైంది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక, డిజిటల్ సేవలు అందిస్తున్న 10లక్షల కంటే ఎక్కువ చిన్న రిటైలర్ల నుంచి సేకరించిన వాస్తవ లావాదేవీల డేటా ఆధారంగా నివేదికను రూపొందించింది.

నివేదిక ప్రకారం.. బీమా పాలసీ కొనుగోలు, ప్రీమియం సేకరణ కోసం యూపీఐ క్యూర్ లావాదేవీల సంఖ్య ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 127 శాతం పెరిగింది. అలాగే, కొత్తగా 96శాతం వినియోగదారులు పెరిగారు. పేనియర్ బై ఎండీ-సీఈవో ఆనంద్ కుమార్ బజాజ్ మాట్లాడుతూ బీమా, ఈ కామర్స్, రుణాలు తదితర సేవలు అందించేందుకు అవసరమైన సాధనాలను అందించడం ద్వారా స్థానిక రిటైలర్లకు సాధికారత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రో ఏటీఎంలు, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ నుంచి నగదు ఉపసంహరణలు ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయి. అలాగే, పీఎం కిసాన్ వంటి పథకాల కింద నగదుల బదిలీ సమయంలో ఏఈపీఎస్ ద్వారా నగదు ఉపసంహరణలు 35-45శాతం పెరిగాయి. జమ్మూ కాశ్మీర్‌లో నగదు విత్‌డ్రాలు 74 శాతం పెరిగాయి.

## కార్యాలయ భవనాలకు భలే డిమాండ్



**హైదరాబాద్-నవభూమి:** జీడీపీ వృద్ధి రేటు తగ్గినా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ భవనాల లీజులు మాత్రం 2024లో భారీగా పెరిగాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు హైదరాబాద్‌తో సహా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో రికార్డు స్థాయిలో 6.64 కోట్ల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణం ఉన్న కార్యాలయాల భవనాల లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 14 శాతం ఎక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా వెల్లడించింది. లీజు ఒప్పందాల పునరుద్ధరణ, కేవలం లెటర్ ఆఫ్ ఇంటెంట్ మాత్రమే ఇచ్చిన లీజు ఒప్పందాలను ఇందులో చేర్చలేదు. ఈ ఏడాది హైదరాబాద్‌లో 1.25 కోట్ల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజుకు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 56 శాతం ఎక్కువ.

గత ఏడాది దేశంలో మరే నగరంలోనూ లీజుకు ఇచ్చిన ఆఫీసు స్పేస్ వృద్ధి రేటు ఇంత భారీగా పెరగలేదని కోలియర్స్ తెలిపింది. లీజుకు ఇచ్చిన ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం పరంగా చూస్తే ఈ విషయంలో 2.17 కోట్ల ఎస్ఎఫ్‌టీతో బెంగళూరు ముందుంది. అయితే గత ఏడాదితో పోలిస్తే ఇది 39 శాతం మాత్రమే ఎక్కువ. ఇదే సమయంలో ముంబై, పుణెల్లోనూ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో వృద్ధి కనిపించింది.

## జనవరి 28న విచారణకు రండి




**న్యూఢిల్లీ-నవభూమి:**అదానీ గ్రూప్ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్తపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28వ తేదీన తన ముందు హాజరు కావాలని లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆమెపై ఫిర్యాదు చేసిన టీఎంసీ ఎంపి మహువా మొయిత్రా సహా ఫిర్యాదుదారులందరూ కూడా అదే రోజు కోర్టుకు హాజరు కావాలంటూ లోక్‌పాల్ కార్యాలయం సమన్లు జారీ చేసింది. లోక్‌సభ సభ్యురాలైన మొయిత్రా, మరో ఇద్దరు దాఖలు చేసిన అవినీతి, ప్రయోజన వైరుధ్యం ఆరోపణలపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నవంబరు 8వ తేదీన బుచ్‌కు లోక్‌పాల్ నోటీసు జారీ చేసింది. దానికి సమాధానంగా డిసెంబరు 7వ తేదీన ఆర్‌పీఎస్ (రెస్పాండెంట్ పబ్లిక్ సర్వెంట్) అఫిడవిట్ రూపంలో సమాధాన ఇచ్చినట్టు లోక్‌పాల్ తెలిపారు.

తదుపరి చర్యగా నోటిమాట ద్వారా తమ వాదన వినిపించేందుకు ఆర్‌పీఎసకు, ఫిర్యాదుదారులకు అవకాశం ఇవ్వాలని భావించినట్టు లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, ఐదుగురు సభ్యులు డిసెంబరు 19వ తేదీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే వాంగ్మూలం ఇచ్చేందుకు జనవరి 28న లోక్‌పాల్ ముందు హాజరు కావాలని తాజా ఉత్తర్వులు జారీ చేశారు.


## కిరాణా స్టోర్లకు దెబ్బేస్తున్న క్విక్ కామర్స్..! కేంద్రానికి రిటైలర్ అసోసియేషన్ కీలక విజ్ఞప్తి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** క్విక్ కామర్స్ సేవలనుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవాలంటే కిరాణా స్టోర్లకు వెంటనే మెరుగైన సాంకేతిక సేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రిటైలర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఆర్ఏఐ) కోరుతున్నది. క్విక్ కామర్స్ సేవలను ఇప్పటికే స్విగ్గీ, బ్లింకిట్, జెప్టోలు ప్రారంభించాయని, దీంతో కొనుగోలుదారులు ఇంటికే పరిమితమయ్యే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో కిరాణా దుకాణాదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని, వెంటనే కేంద్రం జోక్యం చేసుకొని కిరాణా దుకాణాదారులకోసం ప్రత్యేకంగా టెక్నాలజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 42 రిటైల్ అసోసియేషన్ కింద 80 లక్షల మైక్రో, చిన్న మధ్యతరహా రిటైలర్లు ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే కిరాణా దుకాణాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, నూతన కస్టమర్లను అవసరాలను తీర్చడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ఇప్పుడు క్విక్ కామర్స్ కూడా ప్రవేశించడంతో వీటిపై పిడుగుపడినట్లు అయిందని ఎఫ్ఆర్ఏఐ ప్రతినిధి మిశ్రా తెలిపారు. కిరాణా స్టోర్ల కంటే క్విక్ కామర్స్ సంస్థలు అధికంగా రాయితీలు ఇస్తున్నాయని, అతిపెద్ద గిడ్డంగులు, అధిక కస్టమర్లు కలిగివుండటంతో వీటిపై ప్రతికూల ప్రభావం పడనున్నదన్నారు. క్విక్ కామర్స్ సంస్థలు ప్రవేశించడంతో పోటీ మరింత పెరిగిందన్నారు.

## గుడ్ న్యూస్.. నేటి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బిజినెస్ న్యూస్: ఈ ఏడాది నవంబర్ నెలలో తులం రూ.84 వేలుగా ఆల్ టైమ్ రికార్డ్ నెలకొల్పిన పసిడి ధరలు కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. 25 డిసెంబర్ 2024న 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,890 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 77,340 గా ఉంది. అయితే ధరలు తగ్గేందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ ధర పుంజుకుంది. ప్రస్తుతం డాలర్ రూ.85 వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల వ్యాల్యూ పెరిగింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బాండ్ మార్కెట్ వైపు మ్మొగ్గుచూపడంతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. మరోవైపు అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా గోల్డ్ మార్కెట్ పడిపోతూ వస్తోంది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణాత్మకమైన నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇది కూడా బంగారం ధరలు పడిపోయేందుకు తోడైంది.

**దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు ఇవే..**

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో నేడు 22 క్యారెట్ల తులం బంగారం ధర గ్రాముకు రూ.10 తగ్గి రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల ధర గ్రాముకు రూ.10 తగ్గి రూ. 77,340 గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 71,040 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,490 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,340 గా ఉంది. కోల్‌కతాలో 10 గ్రాముల పసిడి ధర రూ. 70,890 ఉండగా, 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.77,340 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ. 77,340 గా ఉంది.కాగా, దేశవ్యాప్తంగా వెండి ధరలు సైతం కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నిన్నటి ధరతో పోలిస్తే కిలోకు రూ.100 తగ్గి రూ.98,800 వద్ద వెండి ట్రేడ్ అవుతోంది. ఢిల్లీలో కిలో వెండి రూ.98,800 ఉండగా, చెన్నైలో రూ.98,800, కోల్‌కతాలో రూ.91,300 గా ఉంది. అలాగే ఆర్థిక రాజధాని ముంబైలో రూ.91,300 వద్ద కొనసాగుతోంది.

## జోరుగా ఎయిర్ ట్రాఫిక్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో విమాన ప్రయాణీకుల రద్దీ పెరిగింది. దేశీయంగా ఎయిర్ ప్యాసింజర్స్ గత నెల దాదాపు 12 శాతం పెరిగినట్టు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన తాజా లెక్కలు చెప్తున్నాయి. దేశవ్యాప్తంగా ఆయా మార్గాల్లో భారతీయ సంస్థలకు చెందిన విమాన సర్వీసులు నవంబర్‌లో 1.42 కోట్ల మంది ప్రయాణీకులను మోసుకెళ్లినట్టు డీజీసీఏ వెల్లడించింది. ఈ ఏడాదితో పోల్చితే గత ఏడాది నవంబర్‌లో 11.90 శాతం తక్కువగా ప్రయాణీకులు నమోదయ్యారని పేర్కొన్నది. నాడు 1.27 కోట్లేనని తమ నివేదికలో డీజీసీఏ స్పష్టం చేసింది. ఇక ఈ ఏడాది అక్టోబర్‌లో విమాన ప్రయాణీకుల రద్దీ 1.36 కోట్లుగా ఉన్నది.

**ఇండిగో టాప్**

దేశీయ విమానయాన మార్కెట్‌లో ఇండిగో వాటా అత్యధికంగా 63.6 శాతంగా ఉన్నది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా (24.4 శాతం), ఆకాశ ఎయిర్ (4.7 శాతం), స్పైస్‌జెట్ (3.1 శాతం), అలయెన్స్ ఎయిర్ (0.7 శాతం) ఉన్నాయి. వీటిలో అలయెన్స్ ఎయిర్ మినహా మిగతా సంస్థల వాటా గతంతో పోల్చితే పెరగడం గమనార్హం. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరి-నవంబర్ మధ్య దేశీయ విమానయాన సంస్థలు చూసిన ప్రయాణీకులు 14.64 కోట్లుగా ఉన్నారు. నిరుడు ఇదే సమయంలో 13.82 కోట్లుగా ఉన్నారు. దీంతో వార్షిక వృద్ధి 5.91 శాతంగా ఉన్నది.

**ఆన్ టైమ్‌లో..**

దేశీయ ఎయిర్‌లైన్స్‌ల్లో ఆన్ టైమ్ పర్ఫార్మెన్స్ (ఓటీపీ)పరంగా ఇండిగో 74.5 శాతంతో అన్నింటికంటే ముందున్నది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, ముంబై విమానాశ్రయాల్లో నమోదైన రికార్డులనుబట్టి షెడ్యూల్ ప్రకారం నవంబర్‌లో ఎక్కువగా ఇండిగో విమాన సర్వీసులే నడిచినట్టు తేలింది. ముందుగా ప్రకటించిన సమయానికే ప్రయాణీకులకు అత్యధిక ఇండిగో విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయని డీజీసీఏ తెలిపింది. ఈ విషయంలో ఆకాశ ఎయిర్ 66.4 శాతంతో రెండో స్థానంలో, స్పైస్‌జెట్ కూడా 62.5 శాతంతో ఫర్వాలేదనిపించింది. కానీ 58.9 శాతంతో అలయెన్స్ ఎయిర్, 58.8 శాతంతో ఎయిర్ ఇండియా చివర్లో నిలిచాయి. ఈ క్రమంలోనే గత నెల విమానాల ఆలస్యంతో సుమారు 2.25 లక్షల మంది ప్రయాణీకులు అసౌకర్యానికి గురైనట్టు డీజీసీఏ ప్రకటించింది. 624 మంది నుంచి ఫిర్యాదులు కూడా వచ్చినట్టు చెప్పింది. అలాగే విమానాల రద్దుతో 27,577 మంది ప్రయాణీకులు ప్రభావితమైనట్టు పేర్కొన్నది.

**హైదరాబాద్‌దే హవా**

ఈ ఏడాది పర్యాటకుల తాకిడి అత్యధికంగా ఉన్న నగరాల్లో హైదరాబాద్ ముందున్నదని తమ 'ట్రావెలోపీడియా 2024' వార్షిక నివేదికలో ఓయో తెలిపింది. మంగళవారం విడుదలైన ఈ రిపోర్టులో హైదరాబాద్ తర్వాతి స్థానాల్లో బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా ఉన్నట్టు తేలింది. ఇక రాష్ట్రాలపరంగా ఉత్తరప్రదేశ్ మొదటి స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఈ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను చూసేందుకు ఎక్కువమంది టూరిస్టులు బుకింగ్ చేసుకున్నట్టు ఓయో తెలియజేసింది. మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటకలకూ డిమాండ్ బాగానే కనిపించిందని పేర్కొన్నది. కాగా, ఆధ్యాత్మిక యాత్రలపరంగా చూసినైట్టైతే పూరీ, వారణాసి, హరిద్వార్ ముందు వరుసలో ఉన్నాయి.

## పాత కార్లపై జీఎస్టీ..



**న్యూఢిల్లీ-నవభూమి:**పాత లేదా వాడిన కార్లను విక్రయించే సందర్భంలో ఆర్జించిన లాభంపైనే జీఎసటీ వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. అంటే, వాహన ధరలో తరుగుదల సర్దుబాటు అనంతర నికర విలువ కంటే...అధిక ధరకు విక్రయిస్తేనే..న్యూఢిల్లీ: పాత లేదా వాడిన కార్లను విక్రయించే సందర్భంలో ఆర్జించిన లాభంపైనే జీఎసటీ వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. అంటే, వాహన ధరలో తరుగుదల సర్దుబాటు అనంతర నికర విలువ కంటే అధిక మొత్తానికి విక్రయించగా ఆర్జించిన లాభంపై జీఎసటీ చెల్లించాల్సి ఉంటుంది. పాత లేదా వాడిన వాహనాల (ఎలక్ట్రిక్ వెహికిల్స్ సహా) విక్రయాలపై ఇకపై ఏకరీతిగా 18 శాతం జీఎసటీ విధించాలని గత శనివారం సమావేశమైన జీఎసటీ మండలి నిర్ణయించింది. ఆదాయం పన్ను చట్టం 1961లో సెక్షన్ 32 కింద తరుగుదలను క్లెయిమ్ చేసుకున్న రిజిస్టర్డ్ వ్యక్తులు లేదా విక్రేతలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి మరో వ్యక్తికి పాత కారును విక్రయించిన సందర్భంలో మాత్రం జీఎసటీ వర్తించదు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం..

రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత ఎవరికైనా తన వాహనాన్ని రూ.15 లక్షలకు విక్రయించాడని అనుకుందాం. ఆ వాహనం అసలు ఖరీదు రూ.20 లక్షలు. కాగా, ఇప్పటికే కారుపై రూ.8 లక్షల తరుగుదలను క్లెయిమ్ చేశాడనుకుంటే, నికర విలువ రూ.12 లక్షలు అవుతుంది. ఈ సందర్భంలో వాహన విక్రయ ధర (రూ.15 లక్షలు), తరుగుదల అనంతరం నికర విలువ (రూ.12 లక్షలు) మధ్య వ్యత్యాసం రూ.3 లక్షలపై 18 శాతం జీఎసటీ చెల్లించాల్సి ఉంటుంది.

రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత రూ.20 లక్షల కారుపై ఇప్పటికే రూ.8 లక్షల తరుగుదల క్లెయిమ్ చేసుకోగా రూ.12 లక్షల నికర విలువ చేసే కారును రూ.10 లక్షలకే విక్రయించాడనుకుంటే, ఈ సందర్భంలో నికర విలువ కంటే విక్రయ ధర తక్కువగా ఉంది కాబట్టి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

## కొత్త ఏడాది ఐటీలో నియామకాల జోరు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఈ సంవత్సరం (2024) దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి చేదు అనుభవమే మిగిల్చింది. రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో అమెరికా, యూరోపియన్ కంపెనీలు ఐటీ ఖర్చులు తగ్గించేశాయి. దాంతో ఈ దేశాల నుంచి భారత కంపెనీలకు వచ్చే ఐటీ ప్రాజెక్టులు తగ్గిపోయాయి. ఈ దెబ్బతో దేశీయ ఐటీ కంపెనీల్లో గత ఏడాది (2023)తో పోలిస్తే ఈ ఏడాది నియామకాల జోరు 7 శాతం తగ్గింది. ఇది కూడా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఆదుకోబట్టి మాత్రమే సాధ్యమైంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు జరిగిన ఐటీ కొలువుల నియామకాల్లో 52.6 శాతం వాటా జీసీసీలదే. కొత్త ప్రాజెక్టులు పెద్దగా రాకపోవడంతో ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు భారీగా తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చిన ఆఫర్ లెటర్లనీ ఏదో ఒక పేరుతో వెనక్కి తీసుకున్నాయి. లేదా ఉలుకూ పలుకూ లేకుండా సస్పెన్షన్‌లో పెట్టాయి. దీంతో ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా 2023తో పోలిస్తే ఈ ఏడాది ఫ్రెషర్ల నియామకాలు రెండు నుంచి 15 శాతం మాత్రమే పెంచాయి.

**కొందరికే డిమాండ్**

ఈ సంవత్సరం ఐటీ రంగంలో నియామకాలు తగ్గినా కృత్రిమ మేథ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్స్‌లో పట్టున్న నిపుణులకు మాత్రం మంచి అవకాశాలే లభించాయి. ఈ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2024లో 39% పెరిగాయి. ఈ డొమైన్స్‌లో పట్టున్న నిపుణులు దొరక్క చాలా ఐటీ కంపెనీలు ఉన్న ఉద్యోగులకే పెద్దఎత్తున శిక్షణ ఇస్తున్నాయి. ఇక మంచి అనుభవం ఉన్న మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల నియామకాలూ గత ఏడాదితో పోలిస్తే 35% పెరిగాయి.

**మారిన కంపెనీల వైఖరి**

ఐటీ కంపెనీల వైఖరిలోనూ మార్పు కనిపిస్తోంది. గతంలో ఈ కంపెనీలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మెట్రో నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇవే కంపెనీలు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు స్థానికంగా నిపుణులైన ఉద్యోగులు పుష్కలంగా దొరకడమూ ఇందుకు కారణం. దీంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోని ఐటీ కంపెనీల నియామకాలు 48 శాతం పెరిగాయి.

**ఆశలన్నీ 2025పైనే**

భారత ఐటీ కంపెనీలకు 2025 సంవత్సరం మాత్రం ఆశావహంగానే కనిపిస్తోంది. అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ముగియడం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలు గాడినపడటం ఇందుకు ప్రధాన కారణం. దీంతో వచ్చే జనవరి నుంచి పెద్ద కంపెనీలకు మళ్లీ ప్రాజెక్టుల రాక పెరుగుతుందని టీమ్ లీజ్ ఎడ్‌టెక్ సీఓఓ జైదీప్ కేవల్‌రమణి చెప్పారు. ఆ తర్వాత చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులూ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఐటీ కంపెనీలు ఇప్పటికే డేటా సైన్స్, ఏఐ, ఎంఎల్ నిపుణుల కోసం అన్వేషణ ప్రారంభించాయి. వ్యాపార అవకాశాలను దొరక పుచ్చుకోవాలంటే ఏఐ వంటి అధునాతన టెక్నాలజీలను వేగంగా అందిపుచ్చుకోక తప్పదని విప్రో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) సంధ్యా అరుణ్ చెప్పడం విశేషం.

ఈ విషయంలో ఏ మాత్రం వెనకబడ్డా ఐటీ రంగంలో మనగలగడం కష్టమన్నారు. దీంతో ఈ అధునాతన టెక్నాలజీపై పట్టున్న నిపుణుల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 2025లో 30 నుంచి 35 శాతం వరకు పెరుగుతాయని మార్కెట్ వర్గాల అంచనా. ఐటీ పరిశ్రమ మొత్తంగా చూసినా 2025లో నియామకాలు 15 నుంచి 20 శాతం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల కారణంగా ఐటీ రంగంలో కొన్ని ఉద్యోగాలు మాయమయ్యే ప్రమాదమూ పొంచి ఉంది.

నవభూమి

www.navabhoomi.in

www.epaper.navabhoomi.in

7 హైదరాబాద్ గురువారం 26 । డిసెంబర్ । 2024






## మరణాల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే

**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికాలో మృత్యువాత పడుతున్న తెలుగు విద్యార్థుల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా.. నూతన సంవత్సర వేడుకలు దగ్గరపడుతున్న వేళ ఈ నెలలో వరుస ప్రమాదాల్లో తెలుగు విద్యార్థులు మృతి చెందుతున్న ఘటనలు తెరపైకి వస్తున్నాయి. ఈ సమయంలో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. అవును... అమెరికాలో మరో తెలుగు విద్యార్థి ప్రమాదవసాత్తు చనిపోయారు. అరిజోనాలోని కోకోనినో కౌంటీలో డిసెంబర్ 22న వుడ్స్ కాన్యన్ లేక్ వద్ద మంచులో పడిపోయాడు ఏపీకి చెందిన ఓ విద్యార్థి. దీంతో.. అతడు మృతి చెందినట్లు చెబుతున్నారు. మృతుడిని అభిషేక్ సింగకొల్లిగా గుర్తించినట్లు చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఘు౦% – కెనడాతో కాలు దువ్వుతున్న ఈడీ.. మానవ అక్రమ రవాణా..కాలేజీలపై నిఘా ఈ సమయంలో మరుసటి రోజు (డిసెంబర్ 23) ఉదయం 10 గంటల తర్వాత ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కోకోనినో కౌంటీ షెరీఫ్ కార్యాలయం ధృవీకరించింది. ఈ నెల 22 ఆదివారం మునిగిపోయిన బాధితుడు 26 ఏళ్ల అభిషేక్ సిగకొల్లిగా గుర్తించారని అంటున్నారు. అర్జిజోనా స్టేట్ యూనివర్శిటీలో పాఠశాలలకు హాజరు కావడానికి అభిషేక్ భారత్ నుంచి వచ్చారని చెబుతున్నారు.

ప్రమాదం జరిగిన సమయంలో అభిషేక్ తో పాటు మరో ఇద్దరు కూడా మంచులో పడిపోయినప్పటికీ.. వారు సురక్షితంగా బయట పడగలిగారని అంటున్నారు. దీనికి సంబంధించిన పిక్స్ తెరపైకి వచ్చాయి.

## 'అంబేడ్కరే' 2025 ఎజెండా!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో అవమానించారంటూ పెద్దఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ అంశాన్నే ప్రధాన ఎజెండాగా చేసుకుని 2025లో ఉద్యమించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని గురువారం బెళగావిలో జరిగే వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించనుంది. 1924లో మహాత్మాగాంధీ అధ్యక్షతన కర్ణాటకలోని బెళగావిలో జాతీయ కాంగ్రెస్ సదస్సు జరిగి వందేళ్లు గడచిన సందర్భంగా వర్కింగ్ కమిటీ భేటీని అక్కడ ఏర్పాటు చేశారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని గట్టిగా జనంలోకి తీసుకెళ్లి ఉద్యమిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, మీడియా-పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా మంగళవారమిక్కడ విలేకరులకు తెలిపారు. గురువారంనాటి సమావేశానికి 'నవ సత్యాగ్రహ బైఠక్' అని నామకరణం చేసినట్లు జైరాం వెల్లడించారు.

తమ పార్టీ ఈ వారాన్ని 'అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ'గా పాటిస్తున్నట్లు తెలిపారు. అమిత్‌షాను హోం మంత్రిగా తొలగించడం.. ఆయన తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడమే ఈ సమస్యకు ఏకైక పరిష్కారమన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ, బీజేపీ భావిస్తున్నారని.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానంపై ఏం చేయాలి.. భవిష్యత్‌లో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో వర్కింగ్ కమిటీ భేటీలో లోతుగా చర్చిస్తామని వేణుగోపాల్ చెప్పారు. అమిత్‌షా రాజీనామాను డిమాండ్ చేస్తూ.. మంగళవారం దేశవ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలు ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించాయన్నారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు నవ సత్యాగ్రహ బైఠక్ ప్రారంభమవుతుందన్నారు. మర్నాడు 27న బెళగావిలోనే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీ జరుగుతుందని.. ఇందులో లక్షలమంది కార్యకర్తలు, ఎంపీలు, ఏఐసీసీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

## మనాలీపై మంచు దుప్పటి



**మనాలీ-నవభూమి:** హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీని మంచు దుప్పటి కప్పేసింది. రహదారులపై అర అడుగు నుంచి ఒక అడుగు మేర మంచు గడ్డకట్టింది. దీంతో.. సోలాంగ్-రొహతంగ్ రహదారిపై వెయ్యికి పైగా వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. 700 మందికి పైగా పర్యాటకులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నెహ్రూకుండ్ నుంచి సోలాంగ్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో అధికారులు ముందు జాగ్రత్తగా అటల్ టన్నెల్‌కు వెళ్లడాన్ని నిషేధించారు. ఆ మార్గంలో వాహనాలను అనుమతించడం లేదు. డిసెంబరు-ఫిబ్రవరి కాలంలో మనాలీకి పర్యాటకులు పోటెత్తుతారు. ఈ సీజన్‌లో పర్వతాలు, కొండలు, లోయలను మంచు కప్పేసి.. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే.. సోమవారం నుంచి భారీగా మంచు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. కోట్టిలో 48, రోహ్రూలో 27 ప్రధాన రహదారులు మంచుతో నిండిపోయి, రాకపోకలు జరగడం లేదు.

## రోడ్డుకు సీఎం పేరు.. మండిపడిన విపక్షాలు



**బెంగళూరు-నవభూమి:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కు మరోసారి విపక్షాల నుంచి చుక్కెదురైంది. మైసూరులోని ఒక రోడ్డుకు సిద్ధరామయ్య పేరు పెట్టాలని మైసూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల ఒక ప్రతిపాదన చేసింది. ఇందుకు ప్రజల నుంచి 30 రోజుల్లోగా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. దీనిపై విపక్ష జనతా దళ్ (సెక్యులర్) తాజాగా విమర్శలు గుప్పించింది. సిద్ధరామయ్య అవినీతి ఆరోపణలపై కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో జేడీఎస్ ఒక పోస్టు పెట్టింది.

"చారిత్రక మైసూరు నగరంలోని కెఆర్‌ఎస్ రోడ్డుకు సిద్ధరామయ్య ఆరోగ్య మార్గ్ అనే పేరు పెట్టాలని మైసూరు మెట్రోపాలిటన్ కార్పొరేష్ తీసుకున్న నిర్ణయం గర్హనీయం. ముడాలో అక్రమంగా స్థలం పొంది, మోసానికి పాల్పడిన కేసులో సిద్ధారమయ్య ఏ1 నిందితుడు. కోర్టు, లోకాయుక్త విచారను ఆయన ఎదుర్కొంటున్నారు" అని జేడీఎస్ పేర్కొంది.మైసూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికైన బోర్డు కాదని, అధికారులను రాష్ట్ర ప్రభుత్వమే నియమించిందని జేడీఎస్ తెలిపింది. ఇందుకు ప్రతిగానే మైసూరు సిటీ రోడ్డుకు సిద్ధారమయ్య పేరు పెట్టాలని అధికారులు ప్రతిపాదన చేసినట్టు పేర్కొంది. ముడా భూములను మింగేసిన అవినీతి ముఖ్యమంత్రి పేరును ఒక రోడ్డుకు పెట్టడం అంటే మైసూరు సిటీని, రాష్ట్రాన్ని అవమానించడమే అవుతుందని అభ్యంతరం తెలిపింది. మెటగల్లిలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి టెంపుల్ సర్కిల్, రాయల్ ఇన్ జంక్షన్ మధ్య ఉన్న రోడ్డుకు సిద్ధరామయ్య పేరు పెట్టాలని మైసూర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదనగా ఉంది.

# ఆరుగురిని వివాహం చేసుకున్న యువతి.. తల్లితో కలిసి పక్కా స్కెచ్.. ఏడో వ్యక్తిని కూడా కలవడంతో..



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లి పేరుతో నేరాలు జరగడం ఇటీవల సర్వసాధారణమైంది. కొందరు పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతులను మోసం చేస్తుంటే.. కొందరు యువతులు అదే పెళ్లి పేరుతో యువకులను నిండా ముంచేస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది సినిమా తరహా స్క్రిప్టులు రాసుకుంటూ ఎవరికీ అనుమానం రాకుండా మోసం చేస్తున్నారు.

అయితే

పెళ్లి పేరుతో నేరాలు చేయడం ఇటీవల సర్వసాధారణమైంది. కొందరు పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతులను మోసం చేస్తుంటే.. కొందరు యువతులు అదే పెళ్లి పేరుతో యువకులను నిండా ముంచేస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది సినిమా తరహా స్క్రిప్టులు రాసుకుంటూ ఎవరికీ అనుమానం రాకుండా మోసం చేస్తున్నారు. అయితే ఇలాంటి వారు ఏదో ఒక సందర్భంలో చివరకు పోలీసులకు దొరికిపోవడం చూస్తున్నాం. తాజాగా, ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ యువతి ఏకంగా ఆరుగురిని వివాహం చేసుకుంది. ఏడో వ్యక్తిని కూడా పెళ్లి చేసుకోవాలని చూడగానే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. చివరకు తల్లీకూతుళ్లలా నటిస్తూ వారు చేసిన నిర్వాకం తెలుసుకుని అంతా షాక్ అయ్యారు. వివరాల్లోకి వెళితే..ఉత్తరప్రదేశ్ బండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ప్రాంతానికి చెందిన పూనమ్, సంజనా గుప్తా కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు వివిధ రకాలుగా ఆలోచించేవారు. చివరకు వారిద్దరూ మాట్లాడుకుని పక్కా పథకం ప్రకారం ప్లాన్‌ను అమలు చేశారు. ఈ క్రమంలో పూనమ్ కూతురుగా, సంజనా గుప్తా తల్లిగా నటించడం స్టార్ట్ చేశారు. వీరికి విమలేష్, ధర్మేంద్ర అనే ఇద్దరు వ్యక్తులు కూడా తోడయ్యారు. పెళ్లి ప్రయత్నాలు చేసే వారిని టార్గెట్ చేశారు.

ఇటీవల శంకర్ అనే వ్యక్తి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకున్న విమలేష్.. అతడి వద్దకు వెళ్లి పూనమ్ గురించి చెప్పాడు. ఫొటో చూపించి పెళ్లి ఫిక్స్ చేస్తానని చెప్పడంతో శంకర్ నమ్మాడు. అయితే ఇందుకోసం తనకు రూ.1.5 లక్షల నగదు ఇవ్వాలని కూడా కండీషన్ పెట్టాడు. పెళ్లి అవుతుందనే ఉద్దేశంతో శంకర్ కూడా అందుకు ఇప్పుకొన్నాడు. ఈ క్రమంలో శనివారం శంకర్‌కు పూనమ్‌ను, సంజనా గుప్తాను పరిచయం చేశారు. అనంతరం తాము అడిగిన మొత్తం డబ్బులను అడిగారు. అయితే తల్లీకూతుళ్ల ఆధార్ కార్డులు ఇవ్వాలని శంకర్ అడగడంతో వారు తటపటాయించారు. దీంతో శంకర్‌కు అనుమానం వచ్చి.. రూ.1.5 లక్షల నగదు ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో చివరకు వారంతా కలిసి శంకర్‌ను బెదిరించసాగారు.నగదు చెల్లించి, పూనమ్‌ను పెళ్లి చేసుకోకపోతే చంపేస్తామని శంకర్‌ను బెదిరించారు. దీంతో తనకు కొంచెం సమయం కావాలని వారికి చెప్పి అక్కడి నుంచి తప్పించుకున్న శంకర్.. నేరుగా పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. వెంటనే అప్రమత్తమై పూనమ్, సంజనా గుప్తా, విమలేష్, ధర్మేంద్రను అదుపులోకి తీసుకున్నారు. విచారణంలో వీరు గతంలో ఇలా ఆరుగురితో పూనమ్‌కు వివాహం జరిపించారని, పెళ్లి అయిన కొన్ని రోజులకే నగలు, నగదుతో పారిపోయేదని తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. విచారణ చేస్తున్నారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై నెటిజన్లు షాకింగ్ కామెంట్లు చేస్తున్నారు.

## 'ఓటుకు నోటు' ఆరోపణ చేసిన ఆప్, తోసిపుచ్చిన బీజేపీ



**న్యూఢిల్లీ-నవభూమి:** అరవింద్ కేజ్రీవాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ నియోజక వర్గంలో బీజేపీ నేత పర్వేష్ వర్మ మహిళా ఓటర్లకు రూ.1,100 చొప్పున పంచినట్టు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. బుధవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఈ సంచలన ఆరోపణ చేశారు. ఈ ఆరోపణలను ఆప్ జాతీయ కన్వీనర్ అరవింజ్ కేజ్రీవాల్ బలపరిచారు.

"కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజక వర్గంలోని ఓటర్లకు ఓటర్ ఐడీలు చెక్ చేసి బీజేపీ డబ్బులు పంచింది. ఈరోజు పర్వేష్ వర్మ తన అధికారిక నివాసంలో డబ్బులు పంచుతూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలోని స్లమ్ ఏరియాల్లో నివసించే మహిళలను పిలిచి రూ.1,1000 చొప్పున కవర్‌లో పెట్టి అందించారు" అని అతిషి తెలిపారు.కాగా, తన నియోజకవర్గంలో ఓటర్లకు బీజేపీ రూ.1,100 చొప్పున డబ్బులు పంచినట్టు కేజ్రీవాల్ తెలిపారు. న్యూఢిల్లీ విధాన్ సభ నియోజకవర్గంలో ఇప్పుడే పర్యటించి తాను వచ్చినట్టు చెప్పారు. బీజేపీ నేతలు బహిరంగంగానే ఓట్లు కొంటున్నట్టు అక్కడి ప్రజలు చెప్పారు. వాళ్లు ఒక్కో ఓటుకు రూ.1,100 ఇస్తున్నారు. డబ్బులు తీసుకున్నప్పటికీ వాళ్లకు ఓటు వేసేది లేదని జనం నాతో చెప్పారు" అని కేజ్రీవాల్ ఒక ట్వీట్‌లో తెలిపారు. పర్వేష్ వర్మను తమ సీఎం అభ్యర్థిగా ప్రకటించనున్నట్టు కొందరు తనతో చెప్పారని, అలాంటి వ్యక్తిని సీఎంగా ఢిల్లీ ప్రజలు అంగీకరిస్తారా అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో ప్రశ్నించారు.

**అబద్ధం: పర్వేష్ వర్మ**

కాగా, ఆప్ ఆరోపణలను పర్వేష్ వర్మ తోసిపుచ్చారు. తన తండ్రి దివంగత సాహిబ్ సింగ్ వర్మ (ఢిల్లీ మాజీ సీఎం) ఏర్పాటు చేసిన ఎన్‌జీవో "రాష్ట్రీయ స్వాభిమాన్" తరఫున డబ్బులు అందజేసినట్టు చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ 11 ఏళ్ల పాలనలో మహిళల ఆవేదనను తాను చూశానని, వారికి నెలవారీ రూ.1,100 చొప్పున ఇవ్వాలని తాను నిర్ణయించుకున్నానని చెప్పారు. "అరవింద్ కేజ్రీవాల్ తరహాలో నేను మద్యం పంచడం లేదు. ప్రజలకు సాయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని వెస్ట్ ఢిల్లీ మాజీ ఎంపీ పర్వేష్ వర్మ తెలిపారు. రాష్ట్రీయ స్వాభిమాన్ ప్రజలను ఆదుకోవడంలో ముందుంటుందని, గుజరాత్ భూకంపంలో అతలాకుతలమైన రెండు గ్రామాలు, తుపానులో దెబ్బతిన ఒడిశాలోని నాలుగు గ్రామాలను తిరిగి అభివృద్ధి చేశామని చెప్పారు.

## ఎన్డీయే నేతల సమావేశంలో ఈ అంశాలపై కీలక చర్చ



**న్యూఢిల్లీ-నవభూమి:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఎన్డీయే నేతల సమావేశంలో వన్ నేషన్ – వన్ ఎలక్షన్‌తోపాటు వక్ఫ్ బోర్డ్‌పై చర్చ జరగలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఈ సమావేశం చక్కగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం బుధవారం న్యూఢిల్లీలో లావు శ్రీకృష్ణదేవరాయులు విలేకర్లతో మాట్లాడుతూ.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు పలు సూచనలు, సలహాలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల తోపాటు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జరిగిన చర్చ పై ఈ భేటీలో చర్చించినట్లు ఆయన వివరించారు. అలాగే భవిష్యత్తులో ఎన్డీఏ కూటమి నేతలు ఏ విధంగా సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలనే అంశంపై చర్చించామన్నారు. అదే విధంగా ఎంపీల నియోజకవర్గంలో అభివృద్ధి అంశాలపై సైతం చర్చ జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో ఏ విధంగా ముందుకు తీసుకువెళ్ళాలనే అంశాలపై సైతం చర్చించామన్నారు. లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయో కూడా చర్చించామని వివరించారు.

బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఎన్డీయే నేతల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అమిత్ షా, జేపీ నడ్డా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు, కుమారస్వామి, జితిన్ రామ్ మాంఝీ, లలన్ సింగ్, భుపేంద్ర యాదవ్, రామ్మోహన్ నాయుడు, ప్రతాప్ రావ్ జాదవ్, అనుప్రియా పాటిల్, అరుణ్ సింగ్, రంగ్ గోరా, తుషార్ వెల్లపల్లి, వినయ్ కోరే, సంజయ్ నిషాద్, జాన్ పాండియన్, ఉపేంద్ర కుష్వా తదితర నేతలు హాజరయ్యారు.మరికొద్ది మాసాల్లో ఢిల్లీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనుంది. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్డీయే కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగా బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు సమావేశమయ్యారు. మోదీ సారథ్యంలో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయింది. అనంతరం మూడోసారి ఎన్డీఏ నేతలు ఈ రోజు న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. అదే విధంగా మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారిగా.. నేతలు సమావేశమయ్యారు.ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో పలు విడతలుగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలను గెలుచుకొంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీ (ఎస్), జేడీ (యూ), లోక్ జన శక్తి (రామ్ విలాస్ పాశ్వాన్) తదితర పార్టీల మద్దతు తీసుకుంది. దీంతో మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హర్యానాలలో బీజేపీ, ఆ పార్టీ భాగస్వామ్య పక్షాలు విజయం సాధించిన విషయం విధితమే.

# త్వరలోనే అతిషిని అరెస్టు చేస్తారు..
## కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే తప్పుడు కేసులో ముఖ్యమంత్రి అతిషిని కేంద్ర ఏజెన్సీలు త్వరలోనే అరెస్టు చేయనున్నట్టు వ్యాఖ్యానించారు. అతిషితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, సీబీఐ, ఈడీ, ఐ-టీ ఏజెన్సీల మధ్య ఇటీవల సమావేశం జరిగిందని, తప్పుడు కేసులో సీఎంను అరెస్టు చేయాలనుకుంటున్నట్టు మాట్లాడుకున్నారని, ఆ సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. సీఎం అరెస్టుకు ముందే తన నివాసంలోనూ సౌరభ్ భరద్వాజ్ ఇతర ఆప్ నేతల ఇళ్లలోనూ కేంద్ర ఏజెన్సీలు సోదాలు నిర్వహిస్తాయని అన్నారు.

'గత పదేళ్లలో ఢిల్లీకి బీజేపీ చేసిందేమీ లేదు. కేజ్రీవాల్‌ను నిదించడమే పనిగా పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన పనుల ఆధారంగానే ప్రచారం సాగిస్తోంది" అని మాజీ సీఎం చెప్పారు. ఆప్ ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల వైద్య సాయం కోసం 'మహిళా సమ్మాన్ యోజన' సహా పలు పథకాలను ఆప్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. వీటి కోసం ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం బీజేపీకి నచ్చడం లేదన్నారు. ఢిల్లీ క్యాబినెట్ ఇప్పటికే రూ.1,000 అలవెన్స్‌ను ఆమోదించిందని, నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల పథకాన్ని తాను బతికుండగా ఆగిపోనీయనని చెప్పారు.

**అరెస్టు చేసినా...**

కాగా, ఢిల్లీలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను నిలిపివేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందనే విశ్వసనీయ సమాచారం కేజ్రీవాల్ వద్ద ఉందని అతిషి తెలిపారు. "వాళ్లు నన్ను అరెస్టు చేసినా న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై నాకు నమ్మకం ఉంది. తప్పుడు ఆరోపణలు చేసినా తప్పనిసరిగా బెయిల్ వస్తుందనే నమ్మకం ఉంది" అని సీఎం అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నాయి.

## రేణుకాస్వామి హత్య కేసులో మరో ఐదుగురికి బెయిల్



**బెంగళూర-నవభూవి:** దుర్గ రేణుకా స్వామి హత్యకేసులో విచారణ ఖైదీలుగా కొనసాగుతున్న మరో ఐదుగురికి బెయిల్ మంజూరైంది. బెంగళూరు సెషన్స్ కోర్టు సోమవారం తీర్పును ప్రకటించింది. దీంతో హత్యకేసును ఎదుర్కొంటున్న మొత్తం 17మంది బెయిల్‌పై బయటకు వచ్చినట్ట య్యింది.బెంగళూరు: చిత్రదుర్గ రేణుకా స్వామి హత్యకేసులో విచారణ ఖైదీలుగా కొనసాగుతున్న మరో ఐదుగురికి బెయిల్ మంజూరైంది. బెంగళూరు సెషన్స్ కోర్టు సోమవారం తీర్పును ప్రకటించింది. దీంతో హత్యకేసును ఎదుర్కొంటున్న మొత్తం 17మంది బెయిల్‌పై బయటకు వచ్చినట్ట య్యింది. వీరిలో రాజరాజేశ్వరినగర్‌లోని స్టోని బ్రూక్ రెస్టారెంట్ యజమాని వినయ్, పవిత్రగౌడ అసిస్టెంట్ పవన్, చిత్రదుర్గకు చెందిన దర్శన్ అభిమానసంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర, వినయ్, నందీశ్‌లకు బెయిల్ మంజూరైంది.

పవిత్రగౌడ ఇంట్లో పనిచేసే పవన్ వాట్సప్ మెసేజ్‌లు చేసిన రేణుకాస్వామిని గుర్తించడంలో కీలక భూమికగా వ్యవహరించగా చిత్రదుర్గ నుంచి బెంగళూరుకు తీసుకురావడంలో దర్శన్ అభిమానసంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర వ్యవహరించారు. హత్య జరిగిన రోజు దర్శన్‌తోపాటు పలు వురు స్టోని బ్రూక్ రెస్టారెంట్‌లో గడిపిన విషయం తెలిసిందే. ఇలా కేసుతో సంబంధం ఉన్న మేరకు సుదీర్ఘకాలంపాటు జైలులో గడిపారు.

## గులాబ్‌జామ్.. రసగుల్లా.. ఆమె ఫోన్‌లో మాజీ మంత్రి, బీజేపీ నాయకుడి పేర్లు ఇవి..




**బెంగళూరు-నవభూమి:** మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్‌పేరుతో బంగారు ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించకుండా మోసం చేసిన శ్వేతాగౌడకేసు విచారణలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. కమర్షియల్ స్ట్రీట్ పోలీసుల నోటీసులకు అనుగుణంగా మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్ మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఇదే సందర్భంలోనే సుదీర్ఘంగా పోలీసులు విచారణ సాగించారు.ఆరు నెలలక్రితం ఫేస్‌బుక్ ద్వారా శ్వేతాగౌడ పరిచయమని, ఆ తర్వాత సమాజసేవ చేస్తున్నానంటూ మాట్లాడారన్నారు. ఒకటి రెండు సందర్భాల్లో భేటీ అయ్యామన్నారు. బహుమతి అంటూ బ్రాస్‌లెట్, ఉంగరం ఇచ్చారని పోలీసులకు వర్తూరు వివరించారు. వాటిని పోలీసులకు ఇచ్చారు. 12.50 లక్షల రూపాయల నగదు కూడా వాపసు చేశారు. తన పేరు చెప్పి ఏకంగా రూ.2కోట్ల విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారనే విషయం వ్యాపారి ఫోన్ చేసేవరకు తెలియదన్నారు. తనతోపాటు పలువురు రాజకీయ నాయకులతో ఫొటోలు తీసుకుని మోసం చేసినట్లు తెలుస్తోందన్నారు.

కాగా శ్వేతాగౌడ ఫోన్‌లో వర్తూరు ప్రకాశ్ పేరును గులాబ్‌జామ్‌గాను, బీజేపీ నాయకుడు చలపతి పేరును మైసూరుపాక్‌గా, మరో వ్యక్తి పేరు రసగుల్లాగా నమోదు చేసినట్లు గుర్తించారు. వర్తూరు ప్రకాశ్ పలు బంగారు దుకాణాలకు శ్వేతాగౌడతో కలసి వెళ్లినట్లు తెలుస్తోంది. బంగారం వ్యాపారి సంజయ్‌బాప్నా మాట్లాడుతూ.. తమ వద్ద ఆభరణాల కొనుగోలుకు వర్తూరు ప్రకాశ్, శ్వేతాగౌడ ఇద్దరూ వచ్చారని తొలిసారి డబ్బు చెల్లించారన్నారు. మేం వర్తూరు ప్రకాశ్ ఇంటికే ఆభరణాలు డెలివరీ చేశామని, ఆ తర్వాత శ్వేతాగౌడ రూ.2.9 కిలోల ఆభరణాలు తీసుకుని, నగదు ఇవ్వకుండా మోసం చేశారన్నారు.

## వక్క.. లాభాలు పక్కా....

**బెంగళూరు-నవభూమి:** ఈ ఏడు వక్క సాగులో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులు ఆహార పంటలతో పాటు వాణిజ్య పంటలపై ఆసక్తి పెంచుకోవాలని వ్యవసాయ అధికారి ప్రసాద్() సూచించారు. గురువారం కంప్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు అందజేశారు. కూడ్లిగి పరిధిలోని పలు గ్రామాల రైతులు బంజరు భూముల్లోను, బోర్ల కింద రైతులు వక్క పంట సాగు చేశారని, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు.ఇతర పంటలు నష్టపోతుండంతో పలువురు రైతులు వక్కసాగుపై ఆసక్తి చూపుతున్నారన్నారు. గుడేకోట వద్ద ఇప్పటికే మొక్కలు కూడా దొరుకుతున్నాయన్నారు. రైతులు అధికారుల సూచనలతో పంటను ప్రారంభించాలన్నారు. ఖానాహొసల్లి రైతు రాముడుమాట్లాడుతూ... యేటా ఖరీఫ్, రబీ)లో వాతావరణ మార్పు, వర్షాప్రభావం వల్ల బోర్ల కింద వేసుకున్న వరిపంట బాగా నష్టపోతుందన్నారు. అప్పులు కట్టలేక ఇబ్బంది పడుతున్నామన్నారు.నాలుగేళ్ల కింద వక్క సాగు చేశాననీ, రెండు, మూడు సంవత్సరాలుగా మంచి దిగుబడి వస్తోందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చన్నారు. తక్కువ నీరున్న డ్రిప్ ద్వారా కూడా ఈ పంటను సాగు చేయవచ్చు,

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ | గురువారం | 26 డిసెంబర్ 2024



## క్రిస్మస్ స్పెషల్ పోస్టర్.. బాలకృష్ణ డాకు మహారాజ్ టీం ఇదే

నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం డాకు మహారాజ్ ఎన్‌బీకే 109 గా తెరకెక్కుతున్న ఈ మూవీకి బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా మేకర్స్ క్రిస్మస్ కానుకగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ సినిమాలోని లీడ్ క్యారెక్టర్లను పరిచయం చేశాడు.బాలకృష్ణ ఓ వైపు గండ్రగొడ్డలి చేతబట్టి కనిపిస్తుండగా.. మరోవైపు ఊర్వశి రౌటేలా పిస్తోల్ పట్టుకుంది. బాబీడియోల్, ప్రగ్యాజైశ్వాల్, శ్రద్దాశ్రీనాథ్ పాత్రలు ఎలా ఉండబోతున్నాయో హింట్ ఇచ్చేశాడు. తాజా లుక్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.ఇప్పటికే విడుదల చేసిన హై ఎనర్జిటిక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్దా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్ పోషిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.టెక్సాస్‌లోని డల్లాస్‌లో 2025 జనవరి 4న Texas Trust CU Theatreలో సాయంత్రం 6 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుగనుంది.





## 'గేమ్ ఛేంజర్' పాటల కోసమే 90 కోట్లా?

దర్శకుడు శంకర్ సినిమా అంటే భారీ తనానికి పెట్టింది పేరు. ఇండియాలో మరే డైరెక్టర్ ఆయన స్కేల్ లో సినిమాలు చేయలేరు. ఎలాంటి కథైనా బడ్జెట్ విషయంలో శంకర్ ఏమాత్రం రాజీ పడరు. ప్రతీ ఫ్రేమ్ లోనూ ఆ భారీతనం కనిపిస్తుంది. సన్నివేశాల కోసం వేసే భారీ సెట్ల నుంచి పాటల కోసం ప్రత్యేకంగా నిర్మించే సెట్లు.. .సాంకేతిక నిపుణులు, విఎఫ్ ఎక్స్ వర్క్ ఇలా ప్రతీది కోట్ల రూపాయలతో ముడిపడిన వ్యవహారమే. ఆయన సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ పనులంటే విఎఫ్ ఎక్స్ పనులు ప్రత్యేకంగా హాకాంగ్ లాంటి విదేశాల్లో నిర్వహి స్తుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ ఖర్చు కూడా అతి భారీగా ఉంటుంది. సినిమాల్లో అతడు వాడే టెక్నాలజీ కూడా అంతే అడ్వాన్స్ గా ఉంటుంది. ఇవన్నీ పక్కన బెడితే పాటల కోసం ఆయన నిర్మించే సెట్ల కోసమే కోట్ల రూపాయు ఖర్చు చేస్తారు. నిజానికి ఆయన పాటలుంటే? ఆయన సెట్ నిర్మాణం చూస్తే బ్రహ్మాండమే బద్దలవుతుందా? అన్నట్లు గా ఉంటుంది. ఇప్పటికే గేమ్ ఛేంజర్ లో కొన్ని పాటల సెట్ వర్క్ చూస్తే మతిపోతుంది. ఈ సినిమాలో మొత్తం ఐదు పాట లున్నాయి. ఈ పాటల కోసమే 92 కోట్లు ఖర్చయిందని సమాచారం. ఆ విషయంలో నిర్మాత దిల్ రాజ్ లక్కీ. సాధారణంగా శంకర్ సినిమా పాటల కోసమే 100 కోట్లు చేస్తారు. కానీ గేమ్ ఛేంజర్ నిర్మాత కోసం 8 కోట్లు సేవ్ చేసారుట. అయితే సినిమాలోని ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో చిత్రీకరించిన నా నా హైరానా పాటలన్నింటిలోకి అత్యంత ఖరీదైన పాట. మేకర్స్ ఈ పాటను న్యూజిలాండ్‌లో కొన్ని రోజుల పాటు చిత్రీకరించారు. దీనికి కెమారా ఖర్చు భారీగా అయింది. దాదాపు 18 కోట్లకుపైగా ఈ పాట కోసమే ఖర్చు చేసినట్లు వినిపిస్తుంది. మిగతా పాటలన్నింటికి కలిపి 70 కోట్లకు పైగా వెచ్చించినట్లు తెలుస్తోంది. ఈ పాటలన్నీ ప్రేక్షకుల్ని తప్పక మెప్పిస్తాయనే నమ్మకంతో యూనిట్ కనిపిస్తుంది. ఏపాటకు ఆ పాట ప్రత్యేకత ఉంటుందని తెలుస్తోంది.

## టాలీవుడ్‌లో పరిణామాలు.. మంచు విష్ణు కీలక ప్రకటన!



టాలీవుడ్‌లో కొంత కాలంగా అనేక పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక ఆరోపణలు ఆపై అరెస్ట్, అక్కినేని ఫ్యామిలీ, సమంత-కొండా సురేఖ వివాదం, మంచు మోహన్ బాబు కుటుంబంలో విభేదాలు, తొక్కిసలాట కేసులో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్.. అలా వివిధ అంశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీంతో ఎక్కడ చూసినా ఆ విషయాలపై చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నటుడు మంచు విష్ణు బుధవారం కీలక ప్రకటన చేశారు. తద్వారా 'మా' సభ్యులకు పలు సూచనలు చేశారు. సున్నితమైన విషయాలపై ఎవరూ.. ఎక్కడ కూడా బహిరంగంగా స్పందించకపోవడం మంచిదని అభిప్రాయపడ్డారు.కళాకారులంతా ఎల్లప్పుడూ అన్ని ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులతో అనుబంధం, మంచి సంబంధాలు కలిగి ఉంటారని తెలిపారు మంచు విష్ణు. సినీ ఇండస్ట్రీ ఎప్పుడూ సహకారం, సృజనాత్మకతపై ఆధారపడి నడిచేదని అన్నారు. గతంలో వివిధ ప్రభుత్వాల మద్దతు వల్ల చిత్రసీమ ఎంతో అభివృద్ధి చెందిందని మంచు విష్ణు గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా తెలుగు సినీ ఇండస్ట్రీ మన హైదరాబాద్ లో స్థిరపడేందుకు అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. అత్యంత ముఖ్యమైన ప్రోత్సాహం అందించిందని కొనియాడారు. అప్పటి నుంచి ప్రతి గవర్నమెంట్‌తో కూడా సినీ ఇండస్ట్రీ ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగిస్తూనే ఉందని విష్ణు చెప్పారు. అయితే కొంత కాలంగా టాలీవుడ్ లో జరిగిన పరిణామాలను అందరూ దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. 'మా' మెంబర్స్ అంతా సున్నితమైన విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు బహిరంగంగా ప్రకటించడం మానుకుంటే బెటర్ అని సూచించారు. వివాదాస్పద పరిణామాలపై ఒకేవైపు మాట్లాడటం మానుకోవాలని సభ్యులకు విష్ణు సజెస్ట్ చేశారు. ఏదేమైనా చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని అన్నారు. కాబట్టి అలాంటి అంశాలపై మాట్లాడటం వల్ల అది సమస్యలు పరిష్కరించకుండా మరింత నష్టం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అందుకే ఇలాంటి టైమ్ లో సహనం, సానుభూతి, ఐక్యత అవసరమని తెలిపారు. 'మా' అంతా ఓ పెద్ద ఫ్యామిలీ అని, ఏ సమస్య వచ్చినా అంతా కలిసి ఎదుర్కొందామని అన్నారు. అదే సమయంలో క్రిస్మస్, న్యూ ఇయర్ విషెస్ చెపారు విష.

## సుహాస్ కథానాయకుడిగా నటిస్తున్న మరో విభిన్నమైన ప్రేమకథా చిత్రం "ఓ భామ అయ్యో రామ".



'ఓ భామ అయ్యో రామ' గ్లింప్స్‌లో మాళవిక మనోజ్ తన ప్రియుడు సుహాస్ చేయి పట్టుకొని తీసుకెళ్లి, ఒక బ్యూటిఫుల్ వింటేజ్ కారులో కూర్చోబెడుతుంది. డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్న మాళవిక.. 'దేవుడినైనా రాముడినైనా నడిపించేది ఆడదే' అంటుంది. సుహాస్ దానికి కౌంటర్ గా "అందుకే కదా.. మీరు మా ప్రాణాలు తీస్తారు" అంటూ నసుగుతాడు. ఏంటీ అని ఆమె కోపంతో చూడగా.. "అందుకే కదా, మేం మీకు ప్రాణాలు ఇస్తాము" అంటూ నవ్వుతూ మాట మారుస్తాడు. అయితే స్టార్ట్ చేసిన వెంటనే ఆ కారు ఆగిపోతుంది. ఏంటి చూస్తున్నావ్.. దిగి బండి తోయమని మాళవిక ఆర్డర్ వేయడంతో.. సుహాస్ చేసేదేమీలేక వెనక్కి వెళ్లి కారును నెట్టడంతో ఈ వీడియో ముగుస్తుంది. బ్యాగ్రౌండ్ లో ఒక పెద్ద ఇంటిని మనం చూడొచ్చు. స్త్రీ పురుష లింగ బేధాలతో ప్రేమికుల మధ వచ్చే చిన్న చిన్న గొడవలతో డిఫెరెంట్ కాన్సెప్ట్ తో రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ గా "ఓ భామ అయ్యో రామ" సినిమా తెరకెక్కుతునట్లు తెలుస్తోంది. ఫస్ట్ గ్లింప్స్‌లో సుహాస్ – మాళవిక మనోజ్ మధ్య జరిగే ఫన్నీ సిచ్యుయేషన్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. 'నువ్వు నేను' ఫేమ్ అనితా హస్సానందని ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. ప్రభాస్ శ్రీను, అలీ, బబ్లూ పృథ్వీరాజ్, రవీందర్ విజయ్, రఘు కారుమంచి, మోయిన్, సాత్విక్ ఆనంద్, నయని పావని తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. "ఓ భామ అయ్యో రామ" చిత్రానికి రామ్ గోధాల దర్శకత్వం వహిస్తున్నారు. వి ఆర్ట్స్ బ్యానర్ లో హరీష్ నల్లా నిర్మిస్తున్నారు. ఆనంద్ గడగోని, ప్రదీప్ తాళ్లపురెడ్డి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. రధన్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి ఎస్. మణికందన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. భవిన్ షా ఎడిటర్ గా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు, ఆసక్తికరమైన అప్డేట్లు రాబోతున్నాయి. 'కలర్ ఫోటో' సినిమాతో హీరోగా పరిచయమైన సుహాస్.. తొలి ప్రయత్నంలోనే మంచి సక్సెస్ సాధించడంతో పాటుగా జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నాడు. 'రైటర్ పద్మభూషణ్', 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు', 'ప్రసన్న వదనం', 'గొర్రె పురాణం', 'జనక అయితే గనక' వంటి చిత్రాలతో అలరించాడు. ప్రస్తుతం 'కేబుల్ చారీ', 'ఆనందరావు అడ్వెంచర్స్', 'ఉప్పు కప్పురంబు' లాంటి సినిమాలలో నటిస్తున్న టాలెంటెడ్ యాక్టర్.. "ఓ భామ అయ్యో రామా" అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మరి ఈ చిత్రం ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

## విశ్వక్ 'లైలా'.. మాస్ కా దాస్ నెవ్వర్ బిఫోర్ లుక్



టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. చేతి నిండా ప్రాజెక్టులతో బిజీ బిజీగా గడుపుతున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి వైవిధ్యమైన కథలు ఎంచుకుంటున్న ఆయన.. ఇప్పుడు కూడా అదే పంథా కొనసాగిస్తున్నారు. తన యాక్టింగ్ తో సినీ ప్రియులను తెగ అలరిస్తున్నారు. 2024లో గామి, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మెకానిక్ రాకీ చిత్రాలతో సందడి చేసిన విశ్వక్.. ఇప్పుడు వివిధ చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. అందులో లైలా ఒకటి. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాకు రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి గ్రాండ్ గా రూపొందిస్తున్నారు. కొత్త అందం ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తున్న లైలా మూవీపై ఇప్పటికే ఆడియన్స్ లో మంచి బజ్ నెలకొంది. సినిమాలో కాసేపు అమ్మాయి రోల్ లో కనిపించనున్న విశ్వక్ లుక్ ను కొద్ది రోజుల క్రితం మేకర్స్ రిలీజ్ చేశారు. కళ్లు మాత్రమే చూపించినా క్రేజీ రెస్పాన్స్ వచ్చింది. ఆ తర్వాత స్టైలిష్ మోడ్ లో ఉన్న విశ్వక్ పోస్టర్ షేర్ చేశారు. అయితే వచ్చే ఏడాది వాలెంటైన్స్ డే కానుకగా రిలీజ్ కానున్న లైలా.. మూవీ నుంచి మేకర్స్ మరో అప్డేట్ ఇచ్చారు. క్రిస్మస్ కానుకగా కొత్త పోస్టర్ ను రిలీజ్ చేశారు. అందులో విశ్వక్ సేన్.. స్టైలిష్ అండ్ రిచ్ కిడ్ లా కనిపిస్తున్నారు. గోల్డెన్ వాచ్, పెద్ద గొలుసులు వేసుకుని అన్నారు. ఆయన చేతులపై ఉన్న టాటూస్ అట్రాక్షన్ గా నిలిచాయి. విశ్వక్ బోల్డ్ సింబల్స్ బట్టి చూస్తే ఆయన రోల్ సినిమాలో విభిన్నంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు కొత్త పోస్టర్ వైరల్ గా మారగా నెటిజన్లు స్పందిస్తున్నారు. మూవీపై అంచనాలు పెరుగుతున్నాయని, సినిమాలో విశ్వక్ ఫుల్ వెరియేషన్స్ చూపించనున్నట్లు తెలుస్తోందని అంటున్నారు. ఇక లైలా సినిమా క్రూ విషయానికొస్తే.. వాసుదేవ మూర్తి స్క్రీన్ ప్లే అందిస్తుండగా, రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూసుకుంటున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం సమకూరుస్తుండగా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న మూవీ నుంచి న్యూ ఇయర్ కు మరో అప్డేట్ ఇవ్వనున్నారు మేకర్స్.

## సినిమాల్లోకి వచ్చానని అమ్మను అలా అనేశారు: అనన్య



టాలీవుడ్ హీరోయిన్, తెలుగమ్మాయి అనన్య నాగళ్ల గురించి అందరికీ తెలిసిందే. యాక్టింగ్ పై ఇంట్రెస్ట్ తో సాఫ్ట్ వేర్ జాబ్‌ను వదులుకున్న ఆమె.. మల్లేశం మూవీతో హీరోయిన్ గా పరిచయమయ్యారు. ప్రియదర్శి హీరోగా నటించిన ఆ సినిమాలో తన అందం, అభినయంతో తెలుగు సినీ ఇండస్ట్రీలో స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నారు. హీరోయిన్ గా గ్లామర్ కంటే యాక్టింగ్‌కు స్కోప్ ఉన్న పాత్రల్లోనే ఎక్కువగా కనిపిస్తున్న అనన్య.. ఇప్పుడు శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ చిత్రంతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ ప్రముఖ కమెడియన్ వెన్నెల కిషోర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఆ సినిమా.. క్రిస్మస్ కానుకగా నేడు థియేటర్లలో గ్రాండ్ గా విడుదలైంది. అయితే మేకర్స్ రీసెంట్ గా నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్ లో అనన్య చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తన ఇండస్ట్రీ ఎంట్రీ సమయంలో జరిగిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు అనన్య. తాను ఇండస్ట్రీలోకి వచ్చి ఐదేళ్లు అయిందని, మల్లేశం మూవీతో జర్నీ స్టార్ట్ చేశానని తెలిపారు. వచ్చినప్పుడు ఇంట్లో చెప్పలేదని, షూటింగ్ అయ్యాక మరికొద్ది రోజుల్లో సినిమా రిలీజ్ అవుతుందున్న టైమ్‌లో 2 నెలల ముందు చెప్పానని అన్నారు. ఆ సమయంలో అమ్మ చాలా గొడవ పెట్టినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ లో వర్క్ చేస్తున్నప్పుడు ఓ రోజు అమ్మ కాల్ చేసి తనకు జరిగిన విషయాన్ని చెప్పినట్లు పేర్కొన్నారు. నీ పెంపకం అలా ఉంది అని మా అమ్మను ఓన్ రిలేటివ్స్ అన్నారని చెప్పింది. ఆ రోజు చాలా ఫీలయ్యాను. చాలా ఎమోషనల్ కూడా అయ్యాను. ఆ రోజే ఫిక్స్ అయ్యాను. ఏదో ఒక రోజు సక్సెస్ కొట్టి చూపించాలని.. అందుకు చాలా ట్రై చేస్తున్నాను. మల్లేశం తర్వాత నోటెడ్ ఫిల్మ్స్ చేస్తున్నానని నేను అనుకుంటున్నా" అని అనన్య తెలిపారు. "మల్లేశం, ప్లే బ్యాక్, వకీల్ సాబ్, తంత్ర, పొట్టేల్.. ఇప్పుడు వస్తున్న శ్రీకాకుళం షెర్లాక్ హోమ్.. అలా అన్నీ ఫిల్మ్స్‌లో కూడా నా 100% ఇస్తున్నాను. ఒక మంచి కథను ఎంచుకుని ఆ కథకు తగ్గట్టుగా షూటింగ్‌లో క్యారెక్టరైజేషన్ తెలుసుకుని నటిస్తున్నా.. ప్రమోషన్స్‌లో కూడా 100% కన్నా ఎక్కువగా ఇస్తున్నా.." అంటూ అనన్య చెప్పుకొచ్చారు.

## ఈ ఏడాది అత్యధిక ట్యాక్స్ పే చేసిన క్రికెటర్ ఎవరో తెలుసా..?



**న్యూఢిల్లీ- నవభూమి:** క్రికెట్ .. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఆటకు ఉన్న క్రేజ్ మరే ఇతక క్రీడకూ లేదనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రికెటర్లను అభిమానులు దేవుళ్లలా పూజిస్తుంటారు. వాళ్లకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ సినీ తారలకు కూడా ఉండదు. క్రికెటర్లు కూడా ఈ ఆట ద్వారా బాగానే సంపాదిస్తుంటారు. తమ ఆటతీరుతోపాటు ఇతర మార్గాల ద్వారా రూ.కోట్లు అర్జిస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే ఆదాయపన్ను కూడా కడుతుంటారు. ఇలా ఈ ఏడాది అత్యధికంగా ట్యాక్స్ పే చేసిన క్రికెటర్ ఎవరో మీకు తెలుసా..? ఎవరో కాదండీ మన విరాట్ కోహ్లీనే. ఈ ఏడాది ఆయన ఏకంగా రూ.కోట్ల రూపాయలను ఆదాయపన్ను శాఖకు కట్టారు.రన్ మెషీన్‌గా పేరుగాంచిన విరాట్ కోహ్లీ గురించి తెలియని వారు ఉండరు. తన ఆటతీరుతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల్ని సొంతం చేసుకున్నాడు. టీమిండియా (%ఋఋఎ ×అఙఋ%)లో టాప్ బ్యాటర్ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది కింగ్ కోహ్లీనే. కేవలం ఆట పరంగానే కాదు సంపాదనలోనూ అతను కింగే. క్రికెట్ ద్వారానే కాకుండా యాడ్స్, ఇతర బిజినెస్‌ల ద్వారా కోహ్లీ రూ.వందల కోట్లు సంపాదిస్తున్నాడు. అయితే, సంపాదనకు తగ్గట్టు ట్యాక్స్ పే చేస్తున్న క్రికెటర్లలోనూ కోహ్లీ ఫస్ట్‌ప్లేస్‌లో ఉన్నాడు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా పన్ను చెల్లించిన క్రికెటర్‌లలో విరాట్ కోహ్లీ తొలి స్థానంలో నిలిచాడు. కోహ్లీ ఏకంగా రూ.66 కోట్ల పన్ను చెల్లించాడు. ట్యాక్స్ రేట్ల ప్రకారం చూస్తే ఆయన ఆదాయం ఆ ఒక్క ఏడాదిలో ఏకంగా రూ.200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక కోహ్లీ తర్వాత మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ రూ.38 కోట్లతో రెండో స్థానంలో నిలిచారు. సచిన్ టెండూల్కర్ రూ.28 కోట్లు, సౌరభ్ గంగూలీ రూ.23 కోట్లు, భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య రూ.13 కోట్లు, రిషభ్ పంత్ రూ.10 కోట్లు, అజింక్య రహానే రూ.8 కోట్లు, బుమ్రా రూ.7 కోట్లు, శిఖర్ ధావన్ రూ.6 కోట్లు, కేఎల్ రాహుల్ రూ.5 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా రోహిత్ శర్మ..!



**మెల్‌బోర్న్-నవభూమి:** భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ.. మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో.. రెండు, మూడవ టెస్టుల్లో అతను లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసిన విషయం తెలిసిందే. మెల్‌బోర్న్ టెస్టులో కేఎల్ రాహుల్ మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేసే ఛాన్సు ఉన్నట్లు ఓ మీడియా రిపోర్టు ద్వారా తెలిసింది. కానీ శుభమన్ గిల్‌కు చెందిన బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎటువంటి ప్రకటన ఇంకా రాలేదు. ఈ మ్యాచ్‌కు ఇద్దరు స్పిన్నర్లను దించాలని ఇండియా భావిస్తున్నది. రవీంద్ర జడేజాతో పాటు వాషింగ్టన్ సుందర్ కూడా ఆడే అవకాశం ఉన్నది. ఒకవేళ సుందర్ ప్లేస్ కన్ఫర్మ్ అయితే, అప్పుడు నితీశ్ రెడ్డికి మొండి చెయ్యి చూపాల్సి వస్తుంది.మరో వైపు ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అరుదైన రికార్డుకు దగ్గరలో ఉన్నారు. మరో అయిదు వికెట్లు తీస్తే, అతను అంతర్జాతీయ క్రికెట్‌లో ఏడు వందల వికెట్లు తీసిన ఆసీస్ బౌలర్ల జాబితాలో చేరుతాడు. షేన్ వార్న్ 1001, గ్లెన్ మెక్‌గ్రాగ్ 949, బ్రెట్ లీ 718 వికెట్లు తీసుకున్నారు. 284 అంతర్జాతీయ మ్యాచుల్లో స్టార్క్ మొత్తం 695 వికెట్లు తీసుకున్నాడు.

## పీవీ సింధు పెళ్లి జరిగిన రిసార్టు విశేషాలు మీకు తెలుసా?



**హైదరాబాద్-నవభూమి:** బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు.. హైదరాబాదీ వ్యాపారవేత్త వెంకట దత్త సాయిని పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఆ జంట ఉదయ్‌పూర్‌లోని ఓ రిసార్టులో పెళ్లాడారు. ఆ వెడ్డింగ్ వేదిక గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. చాలా విలాసవంతమైన, ప్రత్యేకమైన రఫేల్స్ ఉదయ్‌పూర్ రిసార్టులో సింధు పెళ్లి జరిగింది. ఆ కళ్యాణ వేదిక ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది.సుందరమైన ప్రదేశంలో ఉన్న ఆ ఫైవ్ స్టార్ స్పాట్.. సింధు జీవితంలో ఓ ప్రత్యేకంగా నిలిచింది. 21 ఎకరాలు ఉన్న ఆ ప్యాలెస్ .. ఫ్రెంచ్ ఆల్ట్రా లగ్జరీ బ్రాండ్ రఫేల్స్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రాపర్టీగా గుర్తింపు ఉన్నది. సింగపూర్‌కు చెందిన రఫేల్స్ హోటల్ కూడా ఆ వేదికలోనే ఉన్నట్లు తెలిసింది. ఉదయ్ సాగర్ చెరువు మధ్యలో ఆ హోటల్ ఉంది. అరావలీ పర్వత అందాలు అక్కడ పర్యాటకుల్ని అమితంగా ఆకర్షిస్తుంటాయి. రిసార్టులోని వృక్షాలు,జంతువులు కూడా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తాయి.ఆ ఖరీదైన హోటల్‌లో ఒక రాత్రి అకామిడేషన్ సుమారు లక్ష వరకు ఉంటుందని భావిస్తున్నారు. ప్రైవేట్ పూల్స్, ఆర్ట్‌వర్క్స్, లాన్లు.. ఎంతో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. యురోప్‌కు చెందిన పల్లాడియన్ ఆర్కిటెక్చర్ స్టయిల్‌లో ఆ హోటల్ ప్రాపర్టీని డెకరేట్ చేశారు. రాజ్‌పుత్-మొఘల్ ప్రావీణ్యం కూడా ఆ హోటల్ అందాల్లో కనిపిస్తుంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**